J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 20.11.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 25 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerpatrika.com



- ఎలక్షన్ కమిషన్ ఫిబ్రవరిలో స్థానిక ఎన్నికలు పెట్టాల్సిందే అంటోంది
- ఆంధ్రా ప్రభుత్వం ప్రస్తుత పరిస్థితుల్లో అది అసాధ్యం అంటోంది

# తెగని పంచాయితీ




**ఆం**ధ్రాలో ఎన్నికల కమిషన్ వర్సెస్ ప్రభుత్వం వివాదం చిలికి చిలికి గాలివానగా మారుతోంది. రెండు వ్యవస్థల సమన్వయంతో జరగాల్సిన తంతు ఇద్దరు వ్యక్తుల మధ్య తగువుగా తయారయ్యింది. 2020 ఏప్రియల్‌లో జరగాల్సిన ఎన్నికలను కరోనాని సాకుగా చూపి తమకు చెప్పా పెట్టకుండా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ వాయిదా వేసేశాడన్నది జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఆరోపణ. ఎన్నికల కమిషన్ స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ కాబట్టి తానూ ఎవరికీ ముందుగా చెప్పాల్సిన అవసరం లేదన్నది నిమ్మగడ్డ వాదన.



ఇంతవరకూ బాగానే ఉంది. ఆ తరువాత నిమ్మగడ్డ స్థానంలో మరో వ్యక్తిని రాష్ట్ర ప్రభుత్వం నియమించడం, ఆ నియామకం చెల్లదంటూ కోర్టులను ఆశ్రయించిన నిమ్మగడ్డ మళ్ళీ తన కుర్చీలో కూర్చోవడం, ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలు జరుగుతున్న తరుణం లోనే నిమ్మగడ్డ హైదరాబాదులో ఒక స్టార్ హోటల్లో బిజెపిలో ఉన్న బాబు ఏజెంట్లను రహస్యంగా కలవడం ఇవన్నీ పెద్ద రాజకీయ దుమారాన్నే రేపాయి. ఇన్నాళ్లు వ్యవస్థల మీద అపార నమ్మకాన్ని విశ్వాసాన్ని పెట్టుకున్న సామాన్య పౌరులు ఇప్పుడు వ్యవస్థలనే శంకించే స్థాయిలో ఈ వివాదం రేగింది. ఇటీవల అఖిలపక్ష సమావేశం పెట్టిన నిమ్మగడ్డ, వారి అభిప్రాయం ప్రకారం

(మిగతా 10వ పేజీలో)

# హింసాపురిగా మారుతున్న సింహపురి

## రెచ్చిపోతున్న రౌడీమూక



- ఎవరి అండతో ఈ కండకావరం?
- కలవర పెడుతున్న వరుస సంఘటనలు..
- హింసాత్మక వీడియోలతో ఉలిక్కిపడ్డ నగరవాసులు
- తొట్టి గ్యాంగ్ వ్యవహారంగా తేల్చేసిన పోలీసులు

"నెల్లూరులో రాజ్యమేలుతున్న రౌడీయిజం, ఒక యువకుడిని చితక బాదుతున్న నరరూప రాక్షసుడు"... క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో ఆర్థిక లావాదేవీలలో వచ్చిన వివాదమే ఈ దుర్మార్గానికి కారణం అంటూ నవంబర్ 16వతేది సామాజిక మాధ్యమాలలో వీడియోలు, అన్ని తెలుగు చానళ్లలో వార్తా ప్రసారాలు.

(మిగతా 3వ పేజీలో)



# గరం గరం..

# పోలవరం




- మాటల తూటాలు పేలుతున్నాయి
- "ఎత్తు"కు పైఎత్తులు పడుతున్నాయి

**దే**శమంతా శీతాకాలం చల్లదనంతో వాతావరణం ఆహ్లాదాన్ని కలిగిస్తుంటే, ఆంధ్రాలో మాత్రం పోలవరం పోరు రోజురోజుకీ వేడెక్కుతూ గరంగరంగా తయారై రాజకీయపార్టీల మధ్య మంటలు రగిలిస్తోంది. మాటల తూటాలు పేల్చడంలో ఎవరికి వారు తమ ప్రతాపం చూపిస్తున్నారు.

జాతీయ ప్రాజెక్టుగా నిర్మితమవుతున్న పోలవరం భారతదేశంలోనే ప్రతిష్టాత్మకమైనది. కొన్ని లక్షల ఎకరాలకు సాగునీరు, వందల

(మిగతా 10వ పేజీలో)




GOGAADI
24hr ASSISTANCE
ACROSS
2 STATES
75,000 KM
Assist Network
Avail your Road Assistance.
Contact us at
81 8605 8605
Download the App Now
Download on the App Store
GET IT ON Google Play
* All other services are available across Hyderabad & Nellore

# హింసపురిగా మారుతున్న సింహపురి

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కసారిగా నగరవాసులు ఉలిక్కిపడ్డారు. ఒక్క నెల్లూరులోనే కాదు రెండు తెలుగు రాష్ట్రాలలో ఈ వీడియోలు, వార్తలు చుసిన ప్రతి ఒక్కరూ ఖంగు తిన్నారు. ఇంత దారుణమా...? ఇంత కర్కశమా...?? అంటూ కామెంట్లు పెట్టారు. నా నెల్లూరు ఇలా అయిపోయిందా...? అంటూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న నెల్లూరీయులు ఆవేదన చెందారు, ఆందోళనపడ్డారు. అంతలోనే మరో రెండు వీడియోలు.. మొత్తం మూడు వీడియోలలో కొట్టే రాక్షసుడు ఒక్కడే. దెబ్బలు తిన్నవాళ్ళు వేరు వేరువాళ్ళు. వేరు వేరు సందర్భాలు, ప్రదేశాలు. కానీ కొట్టింది మాత్రం ఒక్కడే... వాడి పేరు రాజశేఖర్. వయసు 22 సంవత్సరాలు, నివాసం భక్తవత్సలనగర్.

కట్‌చేస్తే... ఈ విషయంలో పోలీసుశాఖ శరవేగంగా స్పందించింది. రాష్ట్ర పోలీస్‌బాస్ నేరుగా జోక్యం చేసుకున్నాడు. వెంటనే విషయాన్ని తేల్చాల్సిందిగా ఆదేశించాడు. స్థానిక పోలీసులు రాజశేఖర్‌ని అరెస్టు చేశారు, వాడొక చిల్లరరౌడీ అని, జరిగిన గొడవలన్నీ స్నేహితుల మధ్య జరిగిన చిల్లర గొడవలేనని, ఇదంతా తొట్టిగ్యాంగ్ వ్యవహారం అని, క్రికెట్ బెట్టింగులకు సంబంధించింది కాదని తేల్చి పారేశారు. అయితే, ఆ రాజశేఖర్ పాత నేరస్తుడని గతంలో కొంతమందిపైన జరిగిన రాజకీయదాడులలో వీడు ముద్దాయని చెప్పారు. ఇది క్రికెట్టు బెట్టింగ్ వ్యవహారం కాదని, చిల్లర వ్యహారమని కేసుని నీరు గార్చేసి అందరి కన్నీళ్లు తుడిచే ప్రయత్నం చేశారు.

అసలు వీడు ఎవడు..? వీడికి ఇంత కండకావరం ఎక్కడిది. వీడి వెనుకవున్న ధైర్యం ఏమిటి అన్న విషయాలను మాత్రం గోప్యంగా ఉంచేశారు. సరే మనకు అనవసరం, ఇంతటి నేర ప్రవృత్తి, కర్కశ గుణం వున్న వాడిపైన 'పెట్టీ' కేసులు పెట్టడం ఏంటన్నది ఇప్పుడు సామాన్యుడి ప్రశ్న...? ఈ దుర్మార్గుడు దాడిచేసి తీసుకున్న 30కిపైగా వీడియోలు వాడి సెల్‌ఫోన్‌లో పోలీసులకు దొరికాయని కూడా అంటున్నారు. మరి ఇలాంటి రాక్షసుడిని చిన్నచిన్న కేసులతో ఎలా వదిలేస్తారన్నది కూడ అర్ధంకాని విషయమని జనం విస్తుపోతున్నారు.

గత రెండేళ్ల కాలంలో నెల్లూరు నగరంలో హింసాత్మక సంఘటనలు ఎక్కువైపోతున్నాయి. బెదిరింపులు, బ్లాక్‌మెయిలింగులతో పాటు వ్యక్తులపై దాడి చెయ్యడం, ఇష్టమొచ్చినట్టు కొట్టడం, నీకు దిక్కున్నచోట చెప్పుకో అని వార్నింగ్‌లు ఇవ్వడం సర్వసాధారణమైపోయింది. 'హింసపురి'గా మారుతున్న సింహపురిని కాపాడే బాధ్యత పోలీసుశాఖ తమ భుజస్కంధాలపైకి తీసుకోవాలి. వీరి వెనుక ఉండి నడిపిస్తున్నదెవరో నిగ్గు తేల్చాలి. ఈ రౌడీమూకలో ఉన్న ధైర్యాన్ని, వారి వెనుక ఉన్న భరోసాని అడ్డుకోవాలి. లేదంటే నగరం నరకం అయిపోతుంది. ఇదే వాతావరణం కొనసాగితే కొత్తగా పరిశ్రమలు రావు, వ్యాపారవేత్తలు భయపడతారు. ప్రజలు అభద్రతా భావంతో అల్లాడతారు.

ఎప్పుడో నలభై ఏళ్ళ క్రితం నెల్లూరులో కొంత రౌడీయిజం ఉండేది. అడపాదడపా చిన్న చిన్న సంఘటనలు జరిగేవి, కొన్ని ప్రాంతాలలో కొంతమంది రౌడీలుగా రాజ్యమేలేవారు. అప్పట్లో జిల్లా పోలీసు అధికారులు రౌడీయిజం అంటేనే మండిపడేవాళ్ళు. రౌడీలు ఎక్కడున్నా పట్టుకుని తమదైన శైలిలో గట్టిగా బుద్ధిచెప్పేవాళ్ళు. రౌడీయిజం అనే మాటే వినిపించకుండా, ప్రజలకు ఎక్కడా రౌడీల నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎంతో అప్రమత్తంగా ఉండేవాళ్ళు. పోలీసుల ధాటికి పెద్దపెద్ద రౌడీలే తోకముడిచేవాళ్ళు. దీంతో నెల్లూరంటేనే ఎంతో ప్రశాంతమైన జిల్లాగా రాష్ట్రవ్యాప్తంగా పేరుపొందింది. అయితే, ఇప్పుడా ప్రశాంతత కోల్పోతున్నామని, రౌడీయిజం పెరిగిపోతోందని ప్రజలు బాధపడుతున్నారు. వాస్తవానికి గత కొన్ని నెలలుగా ఈ రౌడీయిజం, గుండాయిజం మళ్ళీ తెరపైకి వచ్చాయి. దౌర్జన్యాలు పెరిగాయి. అరాచక శక్తులు ప్రత్యక్షమవుతున్నాయి. ఇది మంచి సంస్కృతి కాదు, మేధావులు స్పందించాలి. వెంటనే వీటికి మూలాలను కనుక్కుని, రౌడీయిజాన్ని కూకటి వేళ్ళతో సహా పెకలించివేయాలి. లేదంటే సమాజానికి ప్రమాదమే ...!

# భక్తిశ్రద్ధలతో నాగులచవితి



దీపావళి తరువాత వచ్చే కార్తీక శుద్ధ చతుర్థి రోజున నాగులచవితి పండుగను జరుపుకోవడం ఎంతో కాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల 18న జిల్లావ్యాప్తంగా ప్రజలు ఈ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ముఖ్యంగా మహిళలు ఆయా ప్రాంతాల్లో నాగులపుట్టల వద్దకు వెళ్ళి ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నాగులచవితిని పురస్కరించుకుని అనేకమంది ఇళ్ళవద్దనే పూజలు చేసుకున్నారు. నెల్లూరు నగరంలోని మూలపేటలో ఉన్న ధర్మరాజస్వామి దేవస్థానంలోనూ, పొరుకట్ట వద్ద ఉన్న నాగళ్ళ పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలోను, పొదలకూరురోడ్డులో, రాయాజివీధిలో, పెద్దాసుపత్రి సమీపంలో, మూలస్థానేశ్వర దేవాలయంలో..ఇలా అనేకచోట్ల ఉన్న నాగులపుట్టల వద్ద మహిళలు ప్రత్యేకపూజలు చేశారు. నాగుల పుట్టల చుట్టూ దారాలు కట్టి ప్రదక్షిణలు చేసి నాగదేవతకు నైవేద్యాలు సమర్పించారు. తమ కుటుంబాలను చల్లగా కాపాడాలని కోరుకున్నారు. కరోనా మహమ్మారి వ్యాధి నుంచి ప్రజలను రక్షించాలంటూ అనేకమంది భక్తులు నాగమ్మ తల్లిని ప్రార్థించారు.

# పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేస్తాం!..

- డిసెంబరు 25న పట్టాల పంపిణీ
- ముఖ్యమంత్రి వై.యస్.జగన్ వెల్లడి



***రాష్ట్రంలోని పేదలందరికీ ఇళ్ళు కట్టిస్తామని యువనేత వైఎస్ జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేరబోతోంది. నవరత్నాల పథకంలో భాగంగా పేదలకు ఇళ్ళ స్థలాలను పంపిణీ చేసేందుకు జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే కృషి ప్రారంభించారు. అయితే కోర్టు స్టేలు, మరోవైపు కరోనా కారణంగా పలుసార్లు ఆ కార్యక్రమం వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో కోర్టు కేసులున్న భూములు మినహా మిగిలిన స్థలాలను పేదలకు ఇచ్చేందుకు సిఎం జగన్ సన్నద్ధమయ్యారు. డిసెంబరు 25వ ఇళ్ళ స్థలాల పంపిణీ చేస్తామంటూ ముఖ్యమంత్రి ప్రకటించి పేదలకు తీపికబురు చెప్పడంతో రాష్ట్ర వ్యాప్తం గా పేదప్రజల్లో హర్షాతిరేకాలు వెల్లడవుతున్నాయి.***

రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్ళ స్థలాల పట్టాలు పంపిణీ కార్యక్రమాన్ని డిసెంబరు 25వ తేదిన ప్రారంభించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈనెల 18న అమరావతి నుంచి సిఎం కలెక్టర్లు, ఎస్పీలు, జేసీలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడుతూ డిసెంబర్ 25వ తేది తొలి దశలోనే సుమారు 15.10 లక్షల ఇళ్ళ నిర్మాణాలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటిదాకా 30,68,281 మందిని ఇళ్ళ స్థలాల కోసం లబ్దిదారులుగా గుర్తించామని, అయితే గిట్టనివాళ్ళు కోర్టులకు వెళ్ళి పేదలకు ఇల్లస్థలాలు ఇవ్వకుండా రాజకీయం చేస్తున్నారని చెప్పారు. డిసెంబరు 10వ తేదిలోగా భూసేకరణతో పాటు, ప్లాట్ల గుర్తింపు నూటికి నూరుశాతం పూర్తికావాలని, అర్హులైన లబ్దిదారులు ఇంకా ఎవరన్నా మిగిలిపోతే వారిని కూడా కొత్త జాబితాలో చేర్చాలని, వచ్చే నెల 25న ఇళ్ళ స్థలాలు పంపిణీచేసే నాటికి ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించిన లబ్ది దారుల జియో ట్యాగింగ్ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

## కుటిల రాజకీయాలే అడ్డు

పేదలకు ఇళ్ళ స్థలాలు పంపిణీ చేసేందుకు తామెంతగానో కృషిచేస్తున్నా ప్రతిపక్ష పార్టీ కుటిల రాజకీయాల వల్ల జాప్యం జరుగుతూ వచ్చిందని, న్యాయ పోరాటం చేయాల్సి వస్తోందని సిఎం ఈ సందర్భంగా చెప్పారు. పెద్ద పారిశ్రామిక వేత్తలకు ఎకరాలకు ఎకరాలు కట్టబెట్టారు కానీ పేదలకు సెంటు, సెంటున్నర స్థలం ఇస్తామంటే అడ్డుకుంటున్నారని సిఎం ఆవేదనగా అంటూ ఈ యుద్ధంలో గెలుస్తామని, దేవుడు మనకు అండగా ఉంటాడని, ఇది గొప్ప కార్యక్రమమని అన్నారు.

## లేఅవుట్లను అందంగా తీర్చిదిద్దాలి - కలెక్టర్

డిసెంబర్ 25న పేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈనెల 18న నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు అధికారులతో సమావేశ మయ్యారు. జిల్లాలో అందుకు సరైన విధంగా లేఅవుట్లను సిద్ధం చేయాలని, డిసెంబర్ 10వ తేది నాటికే లబ్దిదారులకు ఇళ్ల పట్టాలను ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని, విశాలమైన పార్కులు, రోడ్లు, పార్కులు, పాఠశాలల కోసం రిజర్వుడు స్థలాలు ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

Please note the change
www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

# కేంద్రం ఇచ్చినా.. రాష్ట్రం ఇవ్వడం లేదు

## ఎన్‌ఆర్‌ఇజిఎస్ బిల్లులు చెల్లించేలా చూడండి

**- ఉప రాష్ట్రపతికి మాజీమంత్రి సోమిరెడ్డి లేఖలు**

తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో చేపట్టిన ఎన్‌ఆర్‌ఇజిఎస్ తదితర అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించకుండా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అడ్డుకుంటోందని, దీంతో అనేకమంది కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయంగా మారిందని మాజీమంత్రి సోమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ఈనెల 17న ఆయన నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ ఈ బిల్లులు చెల్లించేందుకు ఏడాది క్రితమే కేంద్రప్రభుత్వం మూడు విడతలుగా 1845 కోట్లు విడుదల చేసిందని, ఆ నిధులకు రాష్ట్రప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌గా కలిపి మొత్తం 2200 కోట్ల రూపాయలు విడుదల చేయాల్సి ఉండగా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విడుదల చెయ్యకపోవడం దురదృష్టకరమన్నారు. కేంద్రప్రభుత్వ ఆదేశాలు అమలు జరిగేలా ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చర్యలు తీసుకుని ఆ పనులకు సంబంధించిన బిల్లులు చెల్లింపు జరిగేలా చూడాలని కోరుతూ ఉపరాష్ట్రపతికి 10వేల లేఖలు పంపుతున్నామని సోమిరెడ్డి తెలియజేశారు. ఈ సమావేశంలో నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టిడిపి నగర ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు ధర్మవరం సుబ్బారావు, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అదుపులోకి వస్తున్న కరోనా

**అయినా జాగ్రత్తగా ఉండాల్సిందే**

జిల్లాలో ఎట్టకేలకు కరోనా తగ్గుముఖం పడుతూ వచ్చి ఇప్పుడిప్పుడే అదుపులోకి వస్తోంది. గత వారంరోజులుగా కరోనా పాజిటివ్ కేసులు బాగా తగ్గాయి. గతంలో రోజుకు వందల్లో వస్తున్న కేసులు ఇప్పుడు 50కి మించడం లేదు. ఈనెల 18న ఒక్కరోజే 4222 మందికి కోవిడ్ పరీక్షలు చేయగా, 38మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. వీరిలో 10 మందిని పెద్దాసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. కోవిడ్ లక్షణాలున్నవారికి కోవిడ్ సెంటర్లలో చికిత్సలు చేస్తున్నారు. చికిత్స పొందుతూ కోలుకున్న మరో 97 మందిని బుధవారం డిశ్చార్జి చేశారు. ఇప్పటిదాకా జిల్లాలో మొత్తం 62,534 మంది కరోనా వ్యాధికి గురయ్యారు. వీరిలో 60,736 మంది వ్యాధి నుంచి కోలుకుని డిశ్చార్జి అయ్యారు. వ్యాధితో చికిత్సలు చేయించుకుంటున్న వారి సంఖ్య 1288 మంది. ఈ వ్యాధి బారిన పడి ఇప్పటిదాకా 570 మంది మృతి చెందారు. కరోనా తగ్గుతున్నట్లు అనిపిస్తున్నా ఈ చలికాలంలో దానిని నమ్మడానికి లేదని, అది పొంచి వుండి మళ్ళీ విజృంభించే అవకాశం ఎంతైనా ఉందని, కనుక ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ కోవిడ్ నియంత్రణకోసం ప్రభుత్వాలు సూచించిన నియమాలను పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. మాస్కులు తప్పనిసరిగా ధరించాలని, శానిటైజేషన్ చేసుకోవడం చేతులు తరచూ సబ్బుతో పరిశుభ్రం చేసుకుంటూ ఉండడం, భౌతిక దూరం పాటించడం వంటి సూచనలను అందరూ తప్పని సరిగా పాటించి కరోనాను కట్టడి చేసేందుకు అందరూ సహకరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## 'ప్రభా'తం

# ఆరోగ్య భరోసా.. ఏదీ?

ఆరోగ్యమే మహాభాగ్యమని ఆర్యోక్తి. కానీ మనదేశంలో అందని ద్రాక్షపండు ఏదైనా ఉందంటే ఇదే. పల్లెపట్టులే దేశప్రగతికి పట్టుగొమ్మలుగా ఉన్నప్పటికీ ఆ పల్లెల్లో ఉన్న ప్రజలకి మాత్రం ఆరోగ్యం అంతంతమాత్రమే. దేశంలోని సుమారు 7 లక్షల గ్రామాల్లో దాదాపు 90 కోట్ల మంది దాకా ప్రజలు నివసిస్తున్నా, 30 వేల దాకా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు పల్లెజనం ఆరోగ్యానికి తమవంతు సేవలందిస్తుంటాయన్న మాటే కానీ, ఇందులో అత్యధికశాతం ఆరోగ్యకేంద్రాలు నేటికీ అస్తవ్యస్తంగానే ఉన్నాయి. అనేక ఆసుపత్రుల్లో వైద్యులు లేకపోవడం, తగినంతమంది సిబ్బంది ఉండకపోవడం, ఒకవేళ ఉన్నా పల్లెజనానికి వైద్యం అందించడం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ఆసుపత్రుల్లో చాలినన్ని వైద్యపరికరాలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతుండడం, ఇంకా మందుల కొరత, సరైన లేదా మెరుగైన వైద్య వసతులు లేకపోవడం వంటి కారణాలతో ప్రభుత్వ వైద్యమంటే పల్లెప్రజల్లో ఎంతో కాలంగా ఏదో తెలియని అయిష్టత ఏర్పడి పోయింది. ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాలకు లేదా ఆసుపత్రులకు వెళ్తే అక్కడ ఎలాంటి వైద్యవసతులు ఉండవనే మాట సర్వవ్యాపితమైపోయింది. దీంతో ఇక చేసేదేమీ లేక ఏ చిన్న అనారోగ్యం వచ్చిపడినా పల్లె ప్రజలు పట్టణాలకో, నగరాలకో వెళ్ళి ప్రైవేటు ఆసుపత్రులు ఎక్కడున్నాయెూ వెదుక్కుంటూ పరుగులు తీయాల్సివస్తోంది.

తీరా.. అక్కడకు వెళ్తే జబ్బులు తగ్గడం సంగతి అటుంచి జేబులు ఖాళీ అవుతుండడం అందరికీ తెలిసిందే. ఈ తీరు ఎప్పటికి మారుతుందో ఆ దేవుడికే తెలియాలి. అందులోనూ ఎక్కువమంది పల్లెప్రజలు పెద్దగా చదువుకున్నవారు కాకపోవడం ప్రైవేటు ఆసుపత్రుల వారికి ఒక వరం. వారి బలహీనతే వీరికి బలం. అమాయకుల్ని బెదరగొట్టి డబ్బు గుంజడం తేలిక కదా!..పెద్దగా ప్రాణాపాయం లేకున్నా రేపో మాపో ప్రాణం పోతుందన్నంతగా భయపెట్టి లేనిపోని పరీక్షలన్నీ చేయడం వారికి మామూలే. అలాంటి పరీక్షలు చేయకుంటే ఆసుపత్రుల నిర్వహణ ఖర్చులన్నీ ఎవరు భరిస్తారు మరి?!.. అయితే అన్ని ప్రైవేటు ఆసుపత్రులూ ఇలాగే ఉంటాయని అనుకోలేం. ఎక్కడో ఏవో కొన్ని ఆసుపత్రులు ఎంతోకొంత సేవాభావంతో ఉండనే ఉంటాయి. అది వేరే సంగతి. అయితే, అత్యధికశాతం ఆసుపత్రుల్లో మాత్రం నిత్యం జరిగే తంతు ఇదే. ఆసుపత్రులకు ఈ డబ్బు జబ్బు అన్నది ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కూడా కాదు.. దేశవ్యాప్తంగా ఉన్నదే. డబ్బు కన్నా ప్రాణం ముఖ్యం కనుక ఉన్నదంతా ఇచ్చైనా ప్రాణం నిలబెట్టుకోవడానికి అత్యవసర వైద్యం చేయించుకోక తప్పడం లేదు. అలా అత్యవసర చికిత్సలు చేయించుకుంటున్న పల్లెజనం సంఖ్య కూడా గణనీయంగానే ఉంటోందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా వైద్యరంగం అత్యాధునిక పరిజ్ఞానంతో ఆకాశమంతగా విస్తరిస్తూ ఉన్నా మన దేశంలో 70 శాతం దాకా ఉన్న పల్లెప్రజలకు మాత్రం అవసరమైన కనీస వైద్యం అందకపోతుండడమే బాధాకరం. మాటలు జాస్తి..చేతలు నాస్తి అన్నట్లుగా దేశంలోనే కాదు అన్ని రాష్ట్రాల్లోనూ ఆరోగ్యానికి సంబంధించి ఎన్నో రకాల పథకాలున్నప్పటికీ ఆచరణలో మాత్రం వీటిలో అనేకం ఇంకా పల్లె గడప తొక్కడం లేదు. కిందిస్థాయిలో ఉన్న పేదల చెంతకు చేరడం లేదన్న నిజం.. నిష్ఠూరమైతే కావచ్చు. నిరంతరం కష్టించి పనిచేసే రైతులు, శ్రామికులు, కష్టజీవులు అత్యధికశాతం మంది పల్లెల్లోనే ఉన్నారు. అర్ధాకలితో అలమటిస్తూనే కుటుంబాలు పోషించుకునేవారు కోకొల్లలు. అయితే, వీరి ఆరోగ్యానికి సరైనా భరోసా ఉండడం లేదు. పోషకాహారం లేక దేశంలో కోట్లాదిమంది పేదజనం నిత్యం అవస్తలు పడుతూనే ఉన్నారు. సమతుల ఆహారం తీసుకోకపోవడం వల్ల రకరకాల వ్యాధులు వస్తుంటాయని, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల అనేక జబ్బులను దూరం చేసుకోవచ్చనీ అందరికీ తెలిసిందే. అయితే, దేశంలో వ్యవసాయ ఉత్పత్తులు భారీగానే పెరుగుతున్నా, జనాభాలో 15 శాతం మందికి ఇంకా పౌష్టికాహారం అందడం లేదని, సుమారు 19 కోట్ల మందికి పైగానే ప్రజలు పౌష్టికాహార లోపంతో బాధలు పడుతున్నారని నిపుణుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పేదరికంతో ఆర్థిక పరిస్థితి బాగా లేక అనేకమంది సరైన ఆహారం తీసుకోలేకపోతున్నారని, ప్రజలు పోషకాహారం తీసుకోగలిగితే వారికి వైద్యఖర్చులు బాగా తగ్గిపోతాయని కూడా నివేదికలు సూచిస్తున్నాయి. మన దేశంలో కోట్లాదిమంది వృద్ధులు, గర్భిణులు, స్త్రీలు, బాలలు పోషకాహారం లేక బక్కచిక్కిపోతున్నారని, ఈ అవస్తల నుంచి ప్రజలను గట్టెక్కించేందుకు కేంద్రంతో పాటు రాష్ట్రప్రభుత్వాలు మరింతగా పల్లె ప్రజల ఆరోగ్యానికి, పేదలకు పౌష్టికాహారం అందించేందుకు అవసరమైన పథకాలను వెంటనే అమలుచేయాల్సి ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ఇప్పుడు కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్న వేళ జనం బిక్కుబిక్కుమంటూ బతకాల్సి వస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యవ్యవస్థలన్నీ కుదేలైపోయాయి. అన్ని దేశాలతో పాటు మనదేశంలోనూ ఇదే దుస్థితి. కరోనా దెబ్బతో దాదాపు అన్ని రంగాల్లోనూ ప్రగతి మందగించింది. ఆర్థికంగా మనదేశం ఇంకా నిలదొక్కుకోవాల్సి ఉంది. ఇంతటి కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కేంద్రప్రభుత్వం ఇప్పటికే ఆయుష్మాన్ భారత్-ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన వంటి పథకాలను రూపుదిద్దుతూ ఉండడం, తద్వారా కోట్లాదిమంది పేదప్రజలకు నగదు రహిత వైద్యసేవలందించే ప్రయత్నాల్లో ఉండడం, మన రాష్ట్రంలోనూ ప్రజల ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా భారీ కృషి జరుగుతూ ఉండడం హర్షదాయకం. అయితే ఇలాంటి ప్రజోపయోగ పథకాలు ఇంకా పటిష్ఠంగా అమలుకావాల్సి ఉంది. అన్నిటికన్నా అందరికీ ఆరోగ్యమే ప్రధానం కనుక దేశంలో విజృంభిస్తున్న కరోనా మహమ్మారి వ్యాధిని కట్టడిచేయడంతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రభుత్వాలు ఇంకా భారీగా నిధులు కేటాయించాల్సి ఉంది. ముఖ్యంగా పల్లెల్లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను పటిష్ఠం చేసి, దేశప్రగతికి మూలస్తంభాలైన పల్లెప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించాల్సి ఉంది. తద్వారా సంపూర్ణ ఆరోగ్యభారత్‌ను తీర్చిదిద్దాల్సి ఉంది.

> ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా మన దేశంలో 70 శాతం దాకా ఉన్న పల్లెప్రజలకు అవసరమైన కనీస వైద్యం నేటికీ అందకపోతుండడమే బాధాకరం. అన్నిటికన్నా అందరికీ ఆరోగ్యమే ప్రధానం కనుక ఒకవైపు కరోనా మహమ్మారి వ్యాధిని కట్టడిచేయడంతో పాటు మరోవైపు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రభుత్వాలు భారీగా నిధులు కేటాయించి ఆరోగ్య భరోసా కల్పించాల్సి ఉంది. ఒక్క కరోనాయే కాదు..అన్ని రకాల వ్యాధుల బారినుంచి ప్రజలను కాపాడి భారతావనిని సంపూర్ణ 'ఆరోగ్యభారత్'గా రూపుదిద్దాల్సిన కర్తవ్యం ప్రభుత్వంపై ఉంది.

# ఆంధ్రా బిజెపికి సత్య, సంజయ్ లాంటి సమర్థులు కావాలి

దక్షిణ భారతదేశంలో పాగా వెయ్యాలని చూస్తున్న భారతీయ జనతా పార్టీకి ఇప్పుడు పార్టీని బలోపేతం చేసి ప్రజలకి చేరువ చేయగలిగిన సమర్థత కలిగిన యువ నాయకులు కావాలి. మొన్న బీహార్లో జరిగిన సాధారణ ఎన్నికలలో గాని, దేశంలో ఇతర చోట్ల జరిగిన ఉప ఎన్నికల్లో గాని భాజపా మంచి విజయాలను సాధించి తన ఉనికిని కాపాడుకుంది.

పార్టీ తనకు అప్పజెప్పిన బాధ్యతలను చిత్తశుద్ధితో పూర్తిచేసి, పార్టీ నాయకులను కార్యకర్తలను సమన్వయం చేయడంలో తన సమర్ధతను రుజువు చేసుకోవడమే కాకుండా పార్టీకి విజయాన్ని చేకూర్చిపెట్టడంలో తనవంతు కృషిచేశాడు పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్. వెంకయ్యకు తోడుగా నీడగా పాతికేళ్ళు పని చేసిన సత్య, ఇప్పుడు ఆయన స్కూల్లోనే నడుస్తున్నాడు, పార్టీ పటిష్ఠతకు నిరంతరం పనిచేస్తూ పార్టీ పెద్దలను ఆకట్టుకుంటున్నాడు. వివిధ హోదాలలో పనిచేసిన వెంకయ్యతో తిరిగే సందర్భంలో తనకు ఏర్పడ్డ పరిచయాలను, సంబంధాలను ఇప్పుడు పార్టీ కోసం వాడుతున్నాడు, వ్యక్తిగతంగా అందరికీ దగ్గరవుతూ, తన పరపతిని పెంచుకుంటూ సమర్ధతను చాటుకుంటున్నాడు.

తెలంగాణలో పార్టీని ప్రగతిపథంలో నడిపించడంలో సఫలమవుతున్నాడు ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్‌కుమార్. ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యంతో పార్టీలోకి వచ్చిన వాడు కాబట్టి క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా తన భవిష్యత్తుకు పునాదులు వేసుకుంటూ అంచెలంచెలుగా ఎదిగి, నేడు తెలంగాణలో పార్టీ భవిష్యత్తుకి దిక్సూచిగా మారాడు సంజయ్. దుబ్బాక ఉపఎన్నికలో పార్టీ సాధించిన విజయోత్సాహంతో రాబోవు గ్రేటర్ ఎన్నికలలో అధిక సీట్లు సాధించడానికి సంసిద్ధమవుతున్నాడు సంజయ్.

ఆంధ్రా బిజెపికి కూడా సత్యకుమార్, సంజయ్‌కుమార్ లాంటి సమర్ధతకలిగిన నాయకుల అవసరం చాలా వుంది. రెండు ప్రధాన ప్రాంతీయ పార్టీల మధ్య బిక్కు బిక్కుమంటున్న భాజపాని శక్తివంతమైన జాతీయపార్టీగా ఆంధ్రాలో అవతరింపజేయాలంటే సత్య, సంజయ్ లాంటి వారి సారథ్యం చాలా అవసరం. ఆంధ్రాలో కాంగ్రెస్‌పార్టీ పూర్తిగా కనుమరుగైన తరుణంలో ప్రస్తుతం వున్న రెండు ప్రాంతీయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎదగడానికి అవకాశమున్న ఏకైక జాతీయ పార్టీ బిజెపి మాత్రమే.

**కె. విద్యాసాగర్‌రెడ్డి, హైదరాబాదు.**

### ఈ-మెయిల్ ప్రజావాణి

lawyerpatrika@gmail.com

# చెరువులుగా మారిన ఖాళీ స్థలాలు

నెల్లూరు నగరంలో ఐదేళ్ల తరువాత కురుస్తున్న సుమారైన వర్షాలతో పట్టణంలోని చాలా కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా మాగుంట లే అవుట్, లెక్చరర్స్ కాలనీ, గోమతి నగర్, ఇస్కాన్ సిటీ, కొండాయపాళెం, భక్తవత్సలనగర్, ఉమ్మారెడ్డిగుంట... ఇలా అనేక కాలనీలలో ఖాళీస్థలాల్లో భారీగా నీళ్ళు నిలబడిపోయి చెరువులను తలపిస్తున్నాయి. గతంలో చాలాసార్లు మా కష్టాలు అధికారులకు, నాయకులకు చెప్పుకున్నాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు, డ్రైనేజీలు సక్రమంగా కట్టకుండా సిమెంటు రోడ్లు వేసేశారు, ఖాళీ స్థలాలలో మట్టి నింపని వారిని శిక్షించడంలేదు, వానాకాలం వస్తే నరకం చూస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఈ చెరువుల నుండి మమ్మల్ని కాపాడాలని కోరుకుంటున్నాం.

**– మహమ్మద్ షరీఫ్, భక్తవత్సలనగర్.**

### లాయర్

**పాఠకులకు మనవి**

మా(మీ) లాయర్ పత్రికకు **సమాచారం / లేఖలు** పంపదలచిన వారు **9866314741** నంబరుకు వాట్స్‌యాప్ ద్వారా గాని, లేదా **lawyerpatrika@gmail.com**కి ఈ-మెయిల్ ద్వారా గాని పంపవలసిందిగా విజ్ఞప్తి.

పోస్టల్ చిరునామా :
ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు,
మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.

- సం/-

# గుంతల రోడ్లతో ఒళ్లు హూనమవుతోంది

నెల్లూరునగరంలో రోడ్లన్నీ గుంతలమయమై ఒళ్లు హూనమవుతోంది. ముఖ్యంగా శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో శిక్షణ తీసుకుని వచ్చినట్లుగా నెల్లూరునగర ఆటోడ్రైవర్ల డ్రైవింగ్ స్పీడు దెబ్బకి జనం ఆసుపత్రులపాలవ్వాల్సి వస్తోంది. వీళ్ళకి గుంతలు కనపడవు, కళ్ళకి గంతలు కట్టుకుని తోల్తారు. అయ్యా అధికారులారా మొదలే రోడ్లన్నీ అంతంతమాత్రంగా ఉండేవి, ఇక మొన్నటి వానలతో గుంతలు కాస్తా లోయలుగా మారాయి. దయచేసి మాపై దయచూపండి. అసలే కరోనా కష్టాలతో అల్లాడుతున్న మాలాంటి సామాన్యులు మళ్ళీ ఇప్పుడు నడుములు, వీపుల నొప్పులతో ఆసుపత్రులకు వెళ్లి ఖర్చు పెట్టుకోలేము.

**– ఆర్. పి. రామయ్య, కొండాయపాళెం.**

# నిశ్శబ్ద దీపావళి

కరోనా పుణ్యమా అని ఈ యేడాది దీపావళి శబ్ద కాలుష్యానికి దూరంగా జరిగింది. ప్రభుత్వాలు విధించిన నిబంధనలు కావచ్చు, కరోనా కష్టాలతో ఏర్పడ్డ ఆర్థిక ఇబ్బందుల వలన కావొచ్చు లేదా టపాసుల వ్యాపారస్తుల అత్యాశ కావచ్చు... ఈసారి దీపావళిలో డబ్బులు తక్కువగానే తగలబెట్టారు. ప్రతి ఏడాది కోట్ల రూపాయలు తగలబెట్టేవాళ్ళు, ఈసారి ఆ ఖర్చు బాగాతగ్గించారు. ఇకపై భవిష్యత్తులో రాబోయే దీపావళిలలో కూడా ప్రజలు ఇదే ఆచారాన్ని, అలవాటుని పాటించి టపాసులపేరుతో కాసులను కాల్చేసే సంప్రదాయానికి స్వస్తి పలికి పర్యావరణాన్ని కాపాడుతూ ఇలాంటి నిశ్శబ్ద దీపావళిని జరుపుకోవడానికి అలవాటుపడితే బాగుంటుంది.

**– పుట్టా హరిత, గూడూరు.**

Please note the change

www.lawyerteluguweekly.com is now www.lawyerpatrika.com

# మురుగు మడుగుగా... నెల్లూరు

- రోత పుట్టిస్తున్న రోడ్లు
- దోమల పుట్టిళ్ళుగా ఖాళీస్థలాలు
- ఈ తీరు ఇంకెప్పుడు మారేనో?....



***గత వారం రోజులుగా వానలు కురుస్తుండడంతో నెల్లూరు నగరం మురుగు మడుగుగా తయారైంది. ఇది ఎప్పుడూ ఉండేదే. డ్రైనేజీ వ్యవస్థ ఎంతోకాలంగా అస్తవ్యస్తంగానే ఉండడంతో రోడ్లు రోత పుట్టిస్తున్నాయి. ఏ వీధి చూసినా ఏమున్నది గర్వకారణం.. ప్రతి వీధి సమస్తం మురుగు గబ్బే'.. అన్నట్లుగా ఉంది. నగరాన్ని సుందరీకరణ చేస్తున్నామంటూ ఎప్పటికప్పుడు నాయకులు, అధికారులు గొప్పలు చెప్పుకోవడమే తప్ప ఆచరణలో పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ పరిస్థితి ఇంకా ఎంతకాలానికి మారుతుందో నంటూ నెల్లూరు నగర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.***

అసలే ఇది నెల్లూరు నగరం. మురుగు గబ్బుకు నిలువెత్తు నిదర్శనం. చిన్న వానొచ్చిన సరే.. సర్రున జారే జారుడు బండల్లా తయారవుతుంటాయి రోడ్లు. మురుగునీటి ప్రవాహం అత్యంత దుర్గంధాన్ని వెలువరిస్తూ ట్రంకురోడ్డు వంటి ప్రధాన కూడళ్ళలో సైతం పెద్ద కాలువల్లా పారుతున్నా..ఆ దుర్గంధానికి అలవాటు పడిపోవడమే తప్ప మరో మార్గాంతరం లేదు నెల్లూరు ప్రజలకి. ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా నెల్లూరు నగరప్రజల తలరాతలు మాత్రం మారడం లేదని ప్రజలు దిగాలుపడి పోతున్నారు. అందులోనూ గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకి నెల్లూరు జలదారుగుంటగానే మారింది. ఈ మురుగు చూస్తే చాలు ఈగలు దోమలు కుప్పలు తెప్పలు. దీంతో వ్యాధులు.. బాధలు. ఈ నరకయాతన ఎప్పుడు పోతుందో ఏమో!.. అంటూ నిత్యం నగర ప్రజలు బాధపడుతున్నా పట్టించుకునేవారే కనిపించడం లేదు. నెల్లూరు నగరంలోని ట్రంకురోడ్డు, చిన్నబజారు, పెద్దబజారు, రంగనాయకులపేట, మూలాపేట, బాలాజీనగర్, ఏసి నగర్, సరస్వతినగర్, సండేమార్కెట్ సెంటర్, దర్గామిట్ట, మాగుంట లేఅవుట్, వేదాయపాళెం ఇలా చెప్పుకుంటూ పోతే ఏ ప్రాంతం చూసినా చెత్తాచెదారం నిండిపోయింది. ఇది చాలదన్నట్లుగా ఒకటే వాన. ఆ వాన నీళ్ళు, సైడు కాలువల్లో నీళ్ళు అన్నీ కలసి రోడ్ల మీదే పరుగులు. మురుగు కాలువలు పొంగిపొర్లుతున్నాయి. ఎక్కడ చూసినా రొచ్చుగుంటలాగా ఉంది. బయట కాలు పెట్టలేని పరిస్థితి. ఎంత దుర్గంధమో.. మాటల్లో చెప్పలేం.

**కనిపించని పచ్చదనం-పరిశుభ్రత :**

నెల్లూరు నగరం మురికికూపంగా మారిపోతున్నదే తప్ప పరిశుభ్రత అన్నది కలికానికి కూడా కనిపించదన్నది వేరే చెప్పనక్కర లేదు. 'పచ్చదనం పరిశుభ్రత' అంటూ అక్కడక్కడా చిన్న చిన్న పిచ్చి మొక్కలు తొలగిస్తున్నట్లు ఫోటోలు తీసుకుంటున్నారు కానీ, కొండల్లా పెరిగిపోతున్న మురుగుదిబ్బల జోలికి ఎవరూ వెళ్ళడం లేదు. ఇంకొన్ని చోట్ల మొక్కలు నాటుతున్నారే తప్ప ఆ తర్వాత వాటి సంరక్షణ మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదు. అవి బతికి బట్టకట్టి చెట్లయ్యేదెప్పుడో ఆ దేవుడికే ఎరుక. నగరంలోని అనేకచోట్ల ఉన్న ఖాళీస్థలాల్లో మళ్ళీ యథాతథస్థితి ఏర్పడుతోంది. వాన కురుస్తుండడంతో ఆ స్థలాలన్నీ మురుగు మడుగులా మారిపోయి దోమలకు, ఈగలకు పుట్టినిళ్ళుగా తయారయ్యాయి. వీటి దెబ్బకు జనం విలవిలలాడిపోతూనే ఉన్నారు. వానొస్తే చాలు నగరంలోని ప్రధానరోడ్లు వరద కాలువలవుతుండడం, అండర్ బ్రిడ్జిల వద్ద నీళ్ళు నిలిచిపోయి వాహనాల రాకపోకలకు బాగా ఇబ్బంది కలుగుతుండడం, శివారు ప్రాంతాలు జలమయం అవుతూనే ఉండడం.. ఇవన్నీ మామూలే. మురికివాడల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోంది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో విస్తరిస్తున్నా మురుగు కాలువలు చక్కదిద్దుకోలేకపోవడం, వానొస్తే చాలు అండర్ బ్రిడ్జిల కింద నీళ్ళు నిలబడి ట్రాఫిక్ వెనక్కి మళ్ళుతుండడం.. మనం ఎక్కడున్నామో... అనిపిస్తుంటుంది. అక్కడక్కడా అధికారులు లేదా నాయకులు ప్రయాణించే చోట్లలో మాత్రం రోడ్లలో నీరు నిల్వకుండా చూస్తున్నారు. ఎక్కడైనా ఫిర్యాదులొస్తాయని భావించే ప్రాంతాల్లో మాత్రం తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నారే తప్ప నగర సమగ్రాభివృద్ధి అన్నది ఎవరి ఆలోచనల్లోనూ లేదు. అసలే గత ప్రభుత్వంలో పాడైపోయిన రోడ్లు ఇప్పుడు మరింత అధ్వాన్నంగా ఉంటున్నాయి. కంకర, తారు లేచిపోయి చాలా చోట్ల రోడ్లు గుంతలు పడి..మట్టిరోడ్లలాగా దర్శనమిచ్చే ప్రాంతాలకు నెల్లూరులో కొదవే లేదు. రోడ్లపై ప్యాచ్‌వర్క్‌లు చేయించే నాథులు లేరు. వీధుల్లో చెత్తాచెదారాన్ని క్రమబద్ధంగా ఎత్తివేసేందుకు నిర్దిష్టమైన ప్రణాళికలున్నాయని అధికారులు చెప్తున్నారే కానీ అవి ఆచరణకు వస్తేగా?.. చెత్త మాత్రం ఎప్పటికప్పుడు పేరుకుపోతూనే ఉంది. ఇలా సమస్యల వలయంలో పడి నెల్లూరు నగరం కోలుకోకుండానే ఉంది. ఏళ్ళు గడిచిపోతూనే ఉన్నాయి కానీ నగర దుస్థితి మాత్రం మారడం లేదని, ఎంతకాలం ఎదురుచూసినా కనీస ప్రాథమిక సదుపాయాలు మాత్రం అందుబాటులోకి రావడం లేదని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

## రైతులకు గిట్టుబాటు ధర ఏదీ?..

**- మాజీమంత్రి సోమిరెడ్డి**



జిల్లాలో ధాన్యం పుట్టి 16వేల రూపాయల దాకా మద్దతు ధర ఉంటే రైతులకు మాత్రం 7500 రూపాయలే దక్కుతోందని, గిట్టుబాటు ధర ఇవ్వకపోతుండడంతో అన్నదాతల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని మాజీమంత్రి సోమిరెడ్డి ఇటీవల ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశాడు. అదేవిధంగా నెల్లూరులోని పెన్నానదిలో ఇసుక ట్రక్కు కేవలం 1300 రూపాయలకే లభించేదని ఇప్పుడు దాని ధర 7500 రూపాయల దాకా చేరిందని, నిర్మాణాలు చేసుకోవడానికి కావాల్సిన ఇసుక ఇంతగా ధర పలుకుతుండడంతో ప్రజల అవస్తలు పెరిగిపోతున్నాయని సోమిరెడ్డి అన్నాడు.

### తిరుపతిలో పనబాకదే గెలుపు - సోమిరెడ్డి ధీమా

తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి తప్పకుండా విజయం సాధిస్తుందని సోమిరెడ్డి ధీమా వ్యక్తం చేశాడు. ఈనెల 16న ఆయన మనుబోలులో అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి నాయకుడు పచ్చిపాల జయరామిరెడ్డి ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్యం గురించి వాకబు చేశాడు. అనంతరం ఆయన స్థానిక నాయకులతో మాట్లాడుతూ తిరుపతి ఉపఎన్నిక పార్లమెంట్ అభ్యర్థి గురించి ప్రస్తావిస్తూ టిడిపి తరఫున పనబాక లక్ష్మి పోటీచేస్తారని, పనబాకకు అన్ని వర్గాల మద్దతు ఉందని, వైకాపాకు వ్యతిరేక పవనాలున్నాయని అన్నాడు. ఇదే రోజు నెల్లూరులో కూడా పర్యటించిన సోమిరెడ్డి, ఇటీవల తన శ్రీమతిని కోల్పోయిన 1వ డివిజన్ మాజీ కార్పొరేటర్ లేబూరు పరమేశ్వరరెడ్డిని పరామర్శించాడు.

## అన్నదాతలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నా

- రైతన్నలకు మరింత భరోసాగా 'సున్నా వడ్డీ' పథకం
- రాష్ట్రవ్యాప్తంగా 510 కోట్ల వడ్డీ రాయితీ

**- ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి**




రైతులకు ఇచ్చిన వాగ్దానాలన్నిటినీ అమలుచేస్తున్నామని, ఇందులో భాగంగానే వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ప్రవేశపెట్టామని, పంట రుణాలు చెల్లించిన రైతులందరికీ వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం వర్తిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 17న ఆయన తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ తదితర ఉన్నతాధికారులతో మాట్లాడారు. రైతులు సకాలంలో పంట రుణాలు చెల్లిస్తే ఆ వడ్డీని ప్రభుత్వమే కడుతుందన్న ఆత్మవిశ్వాసాన్ని ఈ పథకం కలిగిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 510 కోట్ల రూపాయల వడ్డీరాయితీని 14.58 లక్షల మంది రైతుల ఖాతాలో జమ చేస్తున్నామని, గత ప్రభుత్వంలోని బకాయిలను కూడా చెల్లించామని, గత అక్టోబర్ నెలలో దెబ్బతిన్న పంటలకు పెట్టుబడి రాయితీలు విడుదల చేశామని, లక్ష రూపాయల లోపు రుణాలు తీసుకున్న రైతులకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు.

**మరో నెలరోజుల్లో 132 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ :**

రైతులకు సాయంగా మరో నెల రోజుల్లో 132 కోట్ల రూపాయల ఇన్‌పుట్ సబ్సిడీని కూడా విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటికే 10661 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు వగైరాలన్నీ అందజేస్తున్నామని, వైఎస్సార్ జలకళ పథకం కింద ఉచితంగా బోరుబావులు ఏర్పాటు చేస్తున్నామని, రైతులకు 9 గంటల పాటు పగటి పూట విద్యుత్‌ను అందిస్తున్నామని అన్నారు.

**జిల్లాలో 59 వేల మంది రైతులకు సాయం :**

వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంతో జిల్లాలో 59వేల మంది రైతులకు లబ్ది చేకూరుతుందని సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు వివరించారు. ఆ వివరాలన్నిటినీ రైతుభరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించబడతాయన్నారు. జిల్లాలో 800 'రైతు భరోసా' కేంద్రాలు పూర్తి స్థాయిలో రైతులకు సాయం అందిస్తున్నాయన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో పంటలు భద్రపరుచుకునేందుకు ఒక గోడౌన్‌ను కూడా నిర్మించేందుకు కృషి జరుగుతోందన్నారు. ఇప్పటికే 147 గోడౌన్ల నిర్మాణాలకు పరిపాలన అనుమతులు మంజూరు చేశామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ హరీంద్రప్రసాద్, వ్యవసాయశాఖ జేడీ ఆనందకుమారి, జడ్పీ సిఇఓ సుశీల, వ్యవసాయ సలహామండలి ఛైర్మెన్ నిరంజన్‌బాబురెడ్డి పాల్గొన్నారు.

Please note the change
www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

# నెల్లూరు కబుర్లు

## నయనానందకరం.. ప్రాకారోత్సవం

### మూలస్థానేశ్వరాలయంలో విశేష పూజలు



కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని మూలాపేటలో కొలువైవున్న భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 17న స్వామివార్ల ప్రాకారోత్సవాన్ని నయనానందకరంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు తొలుత స్వామివారికి విశేష పూజలు చేశారు. రుద్రహోమం నిర్వహించి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేసి ఆకాశ దీపాలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఇ.ఓ ఆరంబాకం వేణుగోపాల్, ధర్మకర్తల మండలి సభ్యులు ఈ వేడుకలను పర్యవేక్షించారు.

### అయ్యప్పస్వామికి

## నేత్రపర్వంగా పూజోత్సవాలు



నెల్లూరు, వేదాయపాళెంలో కొలువైవున్న అయ్యప్పస్వామి దేవాలయంలో 41 రోజుల పాటు నిర్వహించే మండల పూజోత్సవాల ప్రారంభ సూచకంగా ఈనెల 15న స్వామివారికి విశేష పూజలు చేసి ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించారు. డిసెంబరు 28వతేది వరకు ఈ పూజోత్సవాలు జరుగనున్నాయి. అంగరంగ వైభవంగా ప్రారంభమైన ఈ పూజోత్సవాల్లో ఆలయ ఛైర్మెన్ సిహెచ్ సుకుమార్, శ్రీ స్వామి అయ్యప్ప సేవా సమాజం కార్యదర్శి జి.శేషగిరిరావు, కమిటీ సభ్యులు ఎం.విజయన్, బి.నాగేశ్వర రావు, కత్తి మోహన్‌రావు, కెవి రత్నం, జి.రత్నయ్య ఆధ్వర్యంలో కేరళకు చెందిన వడకేడత్తు పెరుంబడప్పమన్ కేశవన్ నంబూద్రిపాద్ వంశీకులు అయ్యప్పస్వామికి సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఆలయంలో కొత్తగా నిర్మించిన 18 మెట్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ పూజలకు పిడూరు కిషోర్‌రెడ్డి, శరణ్య ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## గురునిలయంలో దుప్పట్ల పండుగ



నెల్లూరు మూలాపేటలో ఉన్న భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి ప్రియ శిష్యులు మాకాని వెంకట్రావు నివాసం (గురునిలయం)లో ఈనెల 16న ఘనంగా దుప్పట్ల పండుగ నిర్వహించారు. వెంకయ్యస్వామి సూక్తుల మేరకు మాకాని కుటుంబసభ్యులు ఈ చలికాలంలో ఇబ్బందులు పడుతున్న వేలాదిమంది అనాథలకు, నిరుపేదలకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి తమ సేవా భావాన్ని చాటుకున్నారు. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ప్రియశిష్యుడు తలుపూరు నారాయణదాసుస్వామి పాల్గొని భక్తులను ఆశీర్వదించారు. తొలుత గురునిలయం నిర్వాహకులు మాకాని కుటుంబసభ్యులు మాకాని గోపిచంద్, హైకోర్టు న్యాయవాది చంద్ర తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పేదలకు దుప్పట్ల పంపిణీతో పాటు అన్నదానం నిర్వహించారు

## ద్వారకకు సన్మానం

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, మాజీ డెప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్‌ను నెల్లూరులోని వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల15న ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామని అంటూ ఆర్యవైశ్యులకు ఆయన చేస్తున్న విశిష్ట సేవలను వారు కొనియాడారు. నగరంలోని ఆర్టీసి బస్‌స్టాండ్ సమీపంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ ఫౌండేషన్ అధ్యక్షకార్యదర్శులు బివి రవి కుమార్, మురళి, కోశాధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

### డిసిసిబిలో..

## సహకార వారోత్సవాలు

సహకార వారోత్సవాల్లో భాగంగా ఈనెల 15న నెల్లూరులోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి తిరుపాల్ రెడ్డి పాల్గొని సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల అభ్యున్నతికి బ్యాంకు చేపడుతున్న కార్యక్రమాలను, కోవిడ్ నియంత్రణలో సహకార సంస్థల కృషిని వివరించారు. సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆయన ఈ సందర్భంగా ఉద్యోగులకు పిలుపునిచ్చారు. డిసిసిబి జనరల్ మేనేజర్ సరిత, డిఎల్‌సిఓ శరభయ్యతో పాటు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

### ఐసిడిఎస్

## పి.డిగా ఉమాదేవి

ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా జి.ఉమాదేవిని నియమిస్తూ స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనూరాధ ఈనెల 16న ఉత్తర్వులు జారీచేశారు. ఏపిడిగా పనిచేస్తున్న ఆమెకు పూర్తిస్థాయి బాధ్యతలను అప్పగించారు. ఇప్పటి దాకా ఈ స్థానంలో విధులు నిర్వహిస్తున్న బి.సుధాభారతిని సహకార శాఖకు బదిలీ చేశారు.

## కొత్త కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీమ్(ఏపి సిపిఎస్) ఎంప్లాయిస్ అసోసియేషన్ కొత్త కార్యవర్గాన్ని ఈనెల 15న ఎన్నుకున్నారు. నెల్లూరులోని తిప్పరాజువారి వీధిలో ఉన్న మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఈ ఎన్నికల్లో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా యం.రమేష్, హెచ్.పెంచలయ్య, ఆర్.రామ కిషోర్, యం.హరి, ఏ.ప్రభాకర్, జిల్లా అధ్యక్షునిగా ఇ.ధనరాజు, ప్రధాన కార్యదర్శిగా కె.వి మహేష్ బాబు తదితరులను ఎన్నుకున్నారు.

## నెహ్రూజీ సేవలు నిరుపమానం

### డిసిసి నేత చేవూరు



పండిట్ జవహర్ లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు నిరుపమానమైనవని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి కొనియాడారు. ఈనెల 13న నెహ్రూ 131వ జయంతి సందర్భంగా నెల్లూరులోని మద్రాస్‌బస్టాండ్ వద్ద ఉన్న నెహ్రూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి తొలి ప్రధానిగా దేశాభివృద్ధికి నిరంతరం సేవలందించిన మహనీయునిగా నెహ్రూజీ సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర ఇన్‌చార్జి షేక్ ఫయాజ్, డిసిసి ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కొండా అనిల్‌కుమార్, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పప్పర్తి గణేష్ బాబు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా, మైనార్టీ విభాగం జిల్లా నేత షేక్ అల్లావుద్దీన్, డిసిసి ప్రధాన కార్యదర్శి మావులూరు సురేష్‌బాబుతో పాటు నాయకులు షేక్ మున్వర్‌బాషా, షేక్ రెహమాన్, పప్పర్తి శ్రీనివాసులు, మహేష్, షేక్ రబ్బానీ, షేక్ మన్సూర్, షేక్ సల్మాన్, షేక్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

Please note the change
www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

### లాయర్ల సంక్షేమానికి

## కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్

### - వైఎస్సార్‌సిపి లీగల్ సెల్ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని న్యాయవాదుల కృషికి ఎంతగానో కృషిచేస్తున్నారని వైఎస్సార్‌సిపి లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లసిరి మురళీధర్‌రెడ్డి కొనియాడారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి మూడేళ్ళు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 16న నెల్లూరులోని న్యాయవాదులు లీగల్‌సెల్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత కరెంటాఫీస్ దాకా సంఘీభావ పాదయాత్ర నిర్వహించి మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ 'లా నేస్తం' పథకం ద్వారా జూనియర్ న్యాయవాదులకు ప్రతినెలా 5వేల రూపాయల వంతున అందజేస్తున్నారని, హెల్త్ ఇన్సురెన్స్ కోసం ప్రతి న్యాయవాదికి 4వేలకు పైగానే చెల్లిస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాధా మనోహర్, జల్లి పద్మాకర్, రంగారావు, నర్సయ్య, సలీం, హరి ప్రసాద్, లతీఫ్, వెంకట్, సాయి, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

### అటవీశాఖలో

## ఖాళీ పోస్టులను భర్తీ చేయండి

### - అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గఫూర్

రాష్ట్రవ్యాప్తంగా అటవీశాఖలో ఉన్న ఖాళీపోస్టులను భర్తీ చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గఫూర్ కోరారు. ఈనెల 15న నెల్లూరులో ఏపి జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల విస్తీర్ణంలో అడవులున్నాయని, అయితే వాటి పరిరక్షణకు తగినంతమంది ఉద్యోగులు లేరని ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శశిభూషణ్ యాదవ్, సీతారామయ్య, గుంటూరు జోనల్ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నెల్లూరు యూనిట్ అధ్యక్షునిగా ఎస్.పిచ్చిరెడ్డి, ఉపాధ్యక్షునిగా సిహెచ్ శ్రీనివాసులు, కార్యదర్శిగా కె.రవీంద్ర బాబు, కోశాధికారిగా ఎం.శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పెంచలయ్య, జాయింట్ సెక్రటరీగా జి.శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## కోటి సోమవారం.. 21న

కార్తీక మాసంలో శ్రీమహావిష్ణువు జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం వచ్చే రోజును కోటి సోమవారం రోజుగా ఎంతో పవిత్రంగా జరుపు కుంటారని, ఈసారి ఎంతో పుణ్య ప్రదమైన ఆరోజు ఈనెల 21న(శనివారం) వస్తుందని, కనుక ఆ రోజును కోటి సోమవారంగా జరుపుకోవాలని ముత్తుకూరుకు చెందిన ప్రముఖ జ్యోతిష శిరోమణి డాక్టర్ జివిబి మురళీకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## కారుణ్య నియామకాలు

జిల్లాలో కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు పొందిన పలువురికి జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు ఈనెల 16న కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. కారుణ్య నియామకాల కింద పద్మ, లోకేష్, కళ్యాణ్ కుమార్, ప్రేమసాయి జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు పొందారు.

### హాస్టళ్ళ సంఘం అధ్యక్షుడుగా

## రాంబాబు

జిల్లా సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా జి.రాంబాబు ఎన్నికయ్యారు. ఈనెల 16న నెల్లూరు దర్గామిట్టలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఈ సంఘానికి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షునిగా రమణయ్య, ఉపాధ్యక్షులుగా పద్మనాభరెడ్డి, కిషోర్, తిరుపతయ్య, జిల్లా కార్యదర్శిగా ఉమాశంకర్ స్వరూప్‌లను ఎన్నుకున్నారు.

### సంగీత శిక్షణకు

## దరఖాస్తులు పంపండి

నెల్లూరులోని ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో 2020-21వ సంవత్సరానికి కర్నాటక సంగీతం, గాత్రం, వయొలిన్, భరతనాట్యం, మృదంగం, నాదస్వరం, డోలు విభాగాల్లో సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈ కోర్సుల పట్ల ఆసక్తి ఉన్నవారు వెంటనే దరఖాస్తులు పంపాలని ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ మద్దెల సాయిబాబా ఈనెల 17న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నెం. 94403 61606కు సంప్రదించాలని తెలిపారు.

# దీప కాంతులతో.. ఆనంద దీపావళి

**దీపావళి పండుగను జిల్లా ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ నెల 14న దీపావళిని పురస్కరించుకుని ఆలయాలకు వెళ్లి పూజలు చేసుకున్నారు. అనేకమంది ఇళ్లలో లక్ష్మీపూజ నిర్వహించుకున్నారు. ఇంకొందరు నోములు నోచుకున్నారు. ప్రమదలంతా ప్రమిదలు వెలిగించి కుటుంబసమేతంగా చిన్నాపెద్దా అందరూ కలిసి ఆ దీప కాంతులతో ఆనందోత్సాహాలతో దీపావళి జరుపుకున్నారు.**



దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని అనేక ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేకపూజలు, విశేష సేవలు జరిగాయి. జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన నరసింహస్వామి ఆలయంలో స్వామివారికి వేడుకగా చందనాలంకారం నిర్వహించారు. వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య శ్రీవారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్ర గడియలను పురస్కరించుకుని ఆలయ పూజారులు హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. నరసింహస్వామి, చెంచులక్ష్మీదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను కొలువు దీర్చి శ్రీకృష్ణుడు, సత్యభామగా అలంకరించి పూజలు చేశారు. ఆలయం వెలుపల నరకాసురుడి బొమ్మను ఉంచి స్వామి విల్లుతో దహనమయ్యేట్లు ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామి-అమ్మవార్ల కళ్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకులు సీతారామయ్య స్వామి తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఎంతో వేడుకగా జరిగాయి.

**రంగనాథస్వామి ఆలయంలో ..**

నెల్లూరు నగరంలోని రంగనాయకుల పేటలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవాలయంలో దీపావళిని పురస్కరించుకుని స్వామివారిని, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి ప్రాకారోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులతో పాటు ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహణాధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీ అభివృద్ధి అభినందనీయం

## ప్రశంసించిన తుడా ఛైర్మెన్



తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఛైర్మెన్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఈనెల 16న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ అభివృద్ధి అభినందనీయమని ఆయన ప్రశంసించారు. తొలుత శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీ ప్రణాళిక, అభివృద్ధి పట్ల సంతోషం వ్యక్తం చేశారు. స్థానికులకు, ముఖ్యంగా మహిళలకు తగినన్ని ఉద్యోగాలు కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలను అభినందించారు. ఈ ప్రాజెక్టుకు అన్ని విధాలా సహకరిస్తామన్నారు.

# జిల్లాలో.. జోరు వాన



జిల్లావ్యాప్తంగా గత కొద్దిరోజులుగా వానలు భారీగానే కురుస్తున్నాయి. ఈశాన్య రుతుపవనాలకు తోడు సముద్రంలో అల్పపీడన ద్రోణి ఏర్పడడంతో జిల్లా అంతా విస్తారంగా వానలు కురుస్తున్నాయి. అడపా దడపా కాస్తంత తెరపిచ్చినా నల్లమబ్బులు ముసురుకుని వాతావరణమంతా చల్లగా తయారైంది. సాయంత్రమైతే చలిగాలులు వీస్తున్నాయి. గత వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాలతో జనజీవనం స్తంభించింది. అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. నెల్లూరు నగరంలో ఎంతోకాలం నుంచి డ్రైనేజీ వ్యవస్థ బాగా లేకపోవడంతో అటు మురుగునీరు ఇటు వాననీరు అంతా కలిసి నెల్లూరంతా బురదగుంటగా మారింది. నగరంలోని ఉమ్మారెడ్డిగుంట, కల్యాణి నగర్, జనశక్తినగర్, బుజబుజనెల్లూరులోని ఆర్టీసి కాలనీ, కేశవనగర్, శివగిరికాలనీ వైయస్సార్‌నగర్, పోలీస్ కాలనీ తదితర ప్రాంతాలన్నీ జలమయం కావడంతో ప్రజలు అవస్థలుపడుతున్నారు. భారీగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని చెరువులు దొరువులు కాలువలు అన్నీ నిండిపోయాయి. కొన్నిచోట్ల నారుమళ్ళు దెబ్బతిన్నాయి. ఈనెల 16వ తేది నాటికి సోమశిల జలాశయంలో 76.42 టిఎంసిలకుపైగానే నీటి నిల్వ ఉండగా, పైతట్టు ప్రాంతాల నుంచి వరద నీరు సుమారు 5వేల క్యూసెక్కులకు పైగానే వస్తోందని అధికారవర్గాలు పేర్కొన్నాయి. అన్ని మండలాల్లో వానలు కురుస్తుండడంతో జలాశయాల్లో పుష్కలంగా నీరు చేరడంతో ఈసారి పంటలకు నీటికి దిగుల్లేదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## సంగం ఆనకట్టపై రాకపోకలు నిలిపివేత



గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు సంగం మండలం ప్రాంతంలో ఉన్న బీరాపేరు, బొగ్గేరుల్లో వరదనీటి ప్రవాహం పెరిగి ఆనకట్టపై నీరు ప్రవహిస్తుండడంతో ముందుజాగ్రత్తగా ఈనెల 17న సంగం ఆనకట్టపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు. దీంతో పొదలకూరు-చేజర్ల మండలాలకు రాకపోకలు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు.

## 27 దాకా రేషన్

జిల్లాలోని బియ్యం కార్డుదారులకు ఈనెల 27వ తేది దాకా సరుకుల పంపిణీ జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల అధికారి బాలకృష్ణారావు తెలిపారు. జిల్లాలోని 9,33,193 బియ్యం కార్డుదారులకు బియ్యం, గోధుమలు, శనగలు ఉచితంగా అందజేస్తామని, బియ్యం కార్డులోని ప్రతి సభ్యునికి 5 కిలోల బియ్యం, ఒక కిలో శనగలు, కిలో బియ్యానికి బదులుగా ఒక కిలో గోధుమలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్డుదారులు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ సరుకులు పొందాలన్నారు.

## రక్తదానం

కొడవలూరు మండలంలోని నార్తురాజుపాళెం గ్రామంలో ఉన్న ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల పలువురు యువకులు రక్తదానం చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు మునీర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కరోనా నేపథ్యంలో రెడ్‌క్రాస్‌లో రక్తనిల్వల కొరత ఏర్పడిందని, అందువల్ల తమవంతుగా సమాజ సేవా భావంతో ఈ కార్యక్రమం చేపట్టామని ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్డీ మునీర్ తెలిపారు.

### పిల్లాపేరు వద్ద.. పురాతనమైన

## శ్రీవారి విగ్రహం లభ్యం

వరికుంటపాడు మండలంలోని గువ్వాడిలో దేవలాలవాగు సమీపంలో పిల్లాపేరు నది ఒడ్డున ఈనెల 15న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహం లభ్యమైంది. ఈ విగ్రహం ఎంతో పురాతనమైనదని భావిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న భక్తులు శ్రీవారి విగ్రహానికి అభిషేకం చేసి పూజలు నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ స్థానిక నాయకుడు రమేష్‌నాయుడు, అర్చకుడు మురళీధర్‌శాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి సంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు.

Please note the change
www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

### అగ్రవర్ణ పేద విద్యార్థులకు...

# రిజర్వేషన్లు ఇవ్వాలి

## బిజెపి నాయకుల డిమాండ్



రాష్ట్రంలో అర్హులైనవారికి రిజర్వేషన్లు ఇవ్వకుండా ప్రభుత్వం అడ్డుకుంటోందని, అగ్రవర్ణ పేద విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. ఈనెల 17న నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద బిజెపి ఆధ్వర్యంలో ధర్నాందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం అగ్రవర్ణ పేదల కోసం ప్రవేశపెట్టిన 10 శాతం రిజర్వేషన్లు పేదలకు ఎంతో ప్రయోజనకరమని, కానీ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆ రిజర్వేషన్లు అమలుచేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఈ రిజర్వేషన్లు అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో బిజెపి నాయకులు తేలపల్లి రాఘవయ్య, కోట వెంకటేశ్వర్లు, రాధాకృష్ణగౌడ్, బుజ్జిరెడ్డి, రాఘవేంద్ర, బిజెవైఎం నాయకులు అశోక్‌నాయుడు, యశ్వంత్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

**కావలిలో బిజెవైఎం ఆందోళన :**

అగ్రవర్ణాల్లో ఉన్నా ఆర్థికంగా ఎన్నో బాధలు పడుతున్న పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్‌ను వెంటనే అమలుచేయాలని బిజెవైఎం నాయకులు పి. రామకృష్ణారెడ్డి, వడ్డే శ్రీనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 17న కావలిలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద వారు ఆందోళన నిర్వహించి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం గత ఏడాది ఈ రిజర్వేషన్లు కల్పించిందని, అయితే రాష్ట్రంలో గతంలో ఉన్న తెదెపా, ఇప్పటి వైకాపా ప్రభుత్వం వాటిని అమలుచేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఇటీవల దాదాపు లక్షా 30వేల వాలంటీర్ల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా ఈ రిజర్వేషన్‌లను అమలుచేసి అగ్రవర్ణ పేద విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరారు. బిజెవైఎం, బిజెపి నాయకులు పాల్గొని కావలి ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు.

# చెరువులకు గండ్లు పడకుండా చూడాలి

## కనుపూరు చెరువును పరిశీలించిన కలెక్టర్



జిల్లాలో ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో నీటిపారుదల అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎక్కడా చెరువులకు గండ్లు పడకుండా చూడాలని, రైతులకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఆదేశించారు. ఈనెల 17న వెంకటాచలం మండలంలోని కనుపూరు చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ చెరువుల నీటి నిల్వ సామర్థ్యాన్ని బట్టి చెరువుల్లో నీళ్ళుండే విధంగా చూడాలన్నారు. సోమశిల నుంచి వరద నీటి ప్రవాహం వస్తుండడంతో కనుపూరు చెరువుకు ప్రమాదం లేకుండా ముందుజాగ్రత్తతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తహశీల్దార్ ప్రసాద్‌తో పాటు నీటిపారుదల ఎస్ఇ కృష్ణారావు, ఇఇ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ కనుపూరులోని గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రైస్‌కార్డుల మ్యాపింగ్ విషయంలో వాలంటీర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సక్రమంగా అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా సిబ్బంది, వాలంటీర్లు పనిచేయాలని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.

**Please note the change**

www.lawyerteluguweekly.com
is now
**www.lawyerpatrika.com**

# శ్రీధర్‌గౌడ్‌కు డాక్టరేట్ ప్రదానం



విక్రమసింహపురి యూనివర్శిటీలో బయోటెక్నాలజీ విభాగం పరిశోధక విద్యార్థి తాళ్ళ శ్రీధర్‌గౌడ్‌కు వివిఎస్‌యు ఈనెల 17న డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. దేశీయ పశువుల్లో చర్మ వర్ణాన్ని నియంత్రించే జన్యువులు అనే అంశంపై జీవసాంకేతిక విభాగం అధిపతి డాక్టర్ కిరణ్మయి పర్యవేక్షణలో ఆ విద్యార్థి పరిశోధక పత్రం సమర్పించి. విఎస్‌యు వీసీ సుదర్శనరావు నుంచి డాక్టరేట్ గౌరవాన్ని అందుకున్నారు. విఎస్‌యు రిజిస్ట్రార్ డా.ఎల్‌వి కృష్ణారెడ్డి, పరీక్షల నిర్వహణాధికారి డా.సివిఎస్ సాయిప్రసాద్‌రెడ్డి, డీన్ అండె ప్రసాద్, ఛైర్మన్ విజయా ఆనంద్‌కుమార్‌బాబు, ప్రిన్సిపాల్ సుజా ఎస్ నాయర్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి ఉప ఎన్నికల్లో బిజెపి గెలుపు ఖాయం

**శాంతారెడ్డి**

తిరుపతి ఎంపి స్థానానికి జరగబోయే ఉప ఎన్నికల్లో ఈసారి బిజెపి గెలుపు తథ్యమని బిజెపి జాతీయ నాయకురాలు శాంతారెడ్డి ధీమాగా చెప్పారు. ఈనెల 17న వెంకటాచలం మండలంలోని చెముదుగుంట వద్ద ఉన్న ఓ కల్యాణమండపంలో జరిగిన బిజెపి సర్వేపల్లి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ క్షేత్రస్థాయి నుంచి బిజెపిని బలోపేతం చేయాలని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కోలా ఆనంద్, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

# రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు

గూడూరు పట్టణంలోని కేంద్ర సహకార బ్యాంకు గూడూరు శాఖ కార్యాలయంలో ఆ బ్యాంకు సిఇఓ సరిత ఇటీవల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా పరిస్థితులు మెరుగుపడుతున్న నేపథ్యంలో రబీ సీజన్‌లో రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని, జిల్లా వ్యాప్తంగా రూ.830 కోట్ల బ్యాంకు లావాదేవీలు జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు అంజిరెడ్డి, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూరు - తిప్పవరప్పాడు ప్రయాణమంటే మాటలు కాదు..

# నరకానికి రహదారిగా మారిన గుంటల రోడ్డు



- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని నాయకులు, అధికారులు
- ఇక్కడ ప్యాచింగ్ వర్క్, కాంట్రాక్టర్లకు గొప్ప వరం
- ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యానికి ఈ రోడ్డే ఒక నిదర్శనం

గూడూరు నుండి వెంకటగిరి, రాపూరు మీదుగా రెండు జిల్లాలను కలుపుతూ వెళ్ళే చెన్నూరు-తిప్పవరప్పాడు రోడ్డంతా ఎంతోకాలం నుంచి గుంటలు మిట్టలుగా ఉంది. ఈ రోడ్డు బాగా దెబ్బ తిని ప్రయాణం నరకయాతనగా మారింది. వాహనాలు వేగంగా వెళ్ళాలంటే అంతే సంగతులు. అంత దౌర్భాగ్యంగా ఉంది ఈ రోడ్డు. అధికారులు, పాలకుల మొద్దు నిద్రకు, పర్యవేక్షణ లోపానికి, లోపాయ కారితనానికి ఈ రోడ్డే ఒక తాజా ఉదా హరణ అని చెప్పుకోవచ్చు. ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ రహదారి ఇంత అస్త వ్యస్తంగా ఉన్నా అటు అధికారులు కానీ, ఇటు నాయకులు కానీ పట్టించుకోవడం లేదని ప్రజలు, ప్రయాణీకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అసలే జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలతో రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. రోడ్లపై ఉన్న గుంటల్లో నీళ్ళు నిలిచి ఉండడం, వాహనాల రాకపోకలతో రోడ్లు బాగా దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో చెన్నూరు- తిప్పవరప్పాడు రోడ్డు పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. చిన్న గుంతలు పడినా వాటిని పూడ్చే దిక్కు లేదు, గుంతలు మరీ పెద్దవిగా మారితే అతుకులు వేసే పనులు మరీ నాసిరకంగా జరిగిపోతుంటాయి. ఈ ప్యాచింగ్ పనులు కేవలం నెల రోజులు లోపలే పూర్తిగా దెబ్బతినిపోయాయంటే పనులు ఎంత నాసిరకంగా చేశారో అర్థం అవుతుంది, ముఖ్యంగా కామాక్షినగర్‌లోని కామా క్షమ్మ గుడి ముందు ఎన్నో సార్లు నాసిరకంగా ప్యాచింగ్ పనులు జరుగుతూనే ఉంటాయి. వర్షం వస్తే నీరు నిలిచి మళ్ళీ గుంతలు మాయం, మళ్ళీ మరమ్మతులు..ఇలా కాలం జరిగిపోతూనే ఉంటుంది. చెన్నూరు నుండి తిప్పవరప్పాడు వరకు సంవత్సరానికి లెక్కలేనన్ని సార్లు ప్యాచింగ్ పనులు చేస్తారు కానీ నాలుగు చినుకులు పడితే రోడ్డుమీద తారు ఉండదు.. కంకర ఉండదు. మోకాలు లోతు గుంతలు తప్ప... ఈ రహదారిలో జరిగిన ప్రమాదాల్లో ఎంతో మంది మరణించారు. ఇంకెంతో మంది గాయాలపాలయ్యారు.. వాహనాలు దెబ్బతినిపోయాయి, ఒళ్ళు హూనం అయిపోతుంటుంది. అయినా ఎవరికీ కనికరం ఉండడం లేదు. అభివృద్ధి గురించి రోజూ డప్పుకొట్టే గూడూరు ఎమ్మెల్యేకి ఈ గుంటల రోడ్డు కనిపించడంలేదా?.. ఇంత గుంతలున్న ఈ రోడ్డు గురించి ఎప్పుడైనా ఆ శాఖ అధికారులతో ఆయన మాట్లాడారా? ప్రజా ప్రయోజనాలు పట్టవా? లేక ఇక్కడ ఆదాయ వనరులు లేవా?.. అని అందరూ చర్చించుకుంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించి ఈ నాలుగు కిలోమీటర్ల రోడ్డును బాగుపరచండి మహాప్రభో అని ప్రజలు మొత్తుకుంటున్నారు.

# ప్రమాద స్థాయిలో పంబలేరు

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గూడూరును ఆనుకుని ప్రవహిస్తున్న పంబలేరు వాగు ప్రవాహం ఉధృతంగా ఉండడంతో ఆ మార్గం మీదుగా వాహనాలు వెళ్ళకుండా గూడూరు ఎమ్మార్వో బి.లీలారాణి సూచనలతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదిశంకరా కాలేజీ ఎదురుగా జాతీయరహదారి నుండి గూడూరు లోపలకు వచ్చే మార్గం మధ్యలో పంబలేరు వాగు వద్ద వరద నీరు ఎక్కువగా ప్రవహిస్తుండడంతో గూడూరు రూరల్, పట్టణ పోలీసులు ఈ దారిని బారికేడ్లు, కంపతో మూసివేసి వాహనాల రాక పోకలను దారి మళ్ళించారు.

# ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా రమేష్



గూడూరు పురపాలక సంఘం ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా కె.రమేష్ మంగళవారం పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు.

పురపాలక కమిషనర్ ఓబులేసు వ్యక్తిగత సెలవుపై వెళ్లడంతో సెట్రల్ సిఐవోగా ఉన్న రమేష్‌ను ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని అన్నారు. గతంలో పురపాలక సంఘం ప్రత్యేకాధికారిగా కూడా ఈయన విధులు నిర్వహించి ఉన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# లయన్స్ క్లబ్ నెహ్రూ జయంతి



గూడూరు పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో బాలల దినోత్సవం, మాజీ ప్రధానమంత్రి నెహ్రూ జయంతిని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు షేక్ రియాజ్‌అహ్మద్, రూపేష్ రెడ్డి, మురళీరెడ్డి, వెంకటరమణయ్య, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు. చిల్లకూరు దళితవాడలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యాన బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు కృష్ణమ్మ, సంఘం నాయకులు సునీల్, వెంకటేష్, సాయి, రాఘవ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైజేపీ దుప్పట్ల పంపిణీ



గూడూరు వైజేపీ లయన్స్ క్లబ్ తరపున తిరుమల క్యాటరింగ్ బాబురావు దాతృత్వంతో ఈ నెల 15వ తేదీ డిఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో 45మంది పేదవారికి చీరలు, దుప్పట్లను ఎల్‌ఏపి స్కూల్ కరస్పాండెంట్ బి.శ్రీకాంత్‌రెడ్డి పంపిణీ చేశారు. వైజేపీ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎన్.నవీన్‌జయకుమార్ ఆధ్వర్యంలో వచ్చిన పేద వారికి స్వీట్లు, భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దాత బాబురావు, బి.సుధాకర్, బి.గురునాథం, ఎస్.ఎల్.ఎన్.బాబు, మంజులమ్మ, ఆర్.వి.రావు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా కార్తీక వేడుకలు



మూలాపేట శివాలయంలో ఆకాశదీపాన్ని వెలిగిస్తున్న మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్

కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా నెల్లూరులోని పలు దేవాలయాల్లో స్వామివార్లకు విశేష పూజలు చేశారు. ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించడంతో ఆలయ ప్రాంగణాలు కార్తీక జ్యోతులతో వెల్లివిరిశాయి. ఆలయాలు విద్యుద్దీప కాంతులతో అలరారాయి. ఈ సందర్భంగా ఎంతో పుణ్యప్రదమైన కార్తీకస్నానాలు చేసి భక్తులు ఆలయాలను దర్శించుకున్నారు. పెన్నానదీ తీరంలో ఉన్న మైపాడు, జొన్నవాడ, కోటితీర్థం, రామతీర్థం తదితర ప్రాంతాల్లో ఉన్న శివాలయాలు భక్తుల సందడితో కనిపించాయి. రామతీర్థం వద్ద అనేకమంది భక్తులు సముద్రతీరంలో స్నానాలాచరించి సమీపంలోనే ఉన్న రామతీర్థంలోని శ్రీ రామలింగేశ్వరుని దర్శించుకున్నారు. కోవిడ్ నిబంధనలను అనుసరించి భక్తులందరూ ఆలయాల్లో భౌతికదూరం పాటిస్తూ స్వామివార్లను దర్శించుకున్నారు. ముఖ్యంగా జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవాలయం, నెల్లూరు నగరంలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయం, శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయం, నవాబుపేటలోని భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి దేవాలయం, మూలాపేటలోని శంకరమఠం, గండవరంలోని శ్రీ ఉదయకళేశ్వరస్వామి ఆలయం, సంగంలోని సంగమేశ్వర దేవాలయం, సైదాపురంలోని సిద్ధలయ్య కోనలో, సోమశిలలోని సోమేశ్వరస్వామి దేవాలయం తదితర ఆలయాల్లో భక్తులు వేడుకగా కార్తీకపూజలు జరుపుకున్నారు.

### శ్రీ మూలస్థానేశ్వరాలయంలో :

నగరంలోని మూలాపేటలో ఉన్న భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో ఈనెల15 ఆదివారం రాత్రి మంత్రి డాక్టర్ అనిల్ ఆకాశదీపాన్ని వెలిగించారు. కరోనా నేపథ్యంలో భక్తులందరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, భౌతికదూరం పాటించి స్వామివార్లను దర్శించుకోవాలని చెప్పారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఆలయ ఇఓ ఆరంబాకం వేణుగోపాల్, వైయస్సార్సీపి నాయకులు పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్, గోగుల నాగరాజు, చాట్ల నరసింహారావు, కొనిదెల సుధీర్, నూనె మల్లికార్జునయాదవ్ పాల్గొన్నారు. కార్తీకమాసంలో శివదీక్షలు చేస్తున్న 250 మంది భక్తులకు మంత్రి అనిల్ వస్త్రసమర్పణ చేశారు. అనంతరం ఈనెల 16న ఆలయంలో జరిగిన కార్యక్రమంలో శివదీక్ష మాలధారణ చేపట్టే భక్తులకు ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వస్త్రాలు, మాలలను పంపిణీ చేశారు.

# భక్తిశ్రద్ధలతో... గంధోత్సవాలు

నెల్లూరుజిల్లాలోని ప్రసిద్ధమైన కసుమూరు, ఏఎస్‌పేట దర్గాల్లో వేడుకగా గంధోత్సవాలు జరిగాయి. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మూడురోజుల పాటు జరిగిన ఈ గంధోత్సవాలు ఈనెల 14తో ముగిశాయి.

### ఏఎస్‌పేట దర్గాలో

ఏఎస్‌పేటలోని పవిత్రమైన హజరత్ ఖాజా నాయబ్‌రసూల్ దర్గా ఉరుసు, గంధోత్సవాల్లో భాగంగా పవిత్రమైన నాయబ్‌రసూల్, బీబీ హబీబా సమాధులకు గంధలేపనం చేశారు. దర్గా కోనేరు మెట్లపై దీపాలు వెలిగించారు. దర్గా నిర్వాహకులు, ప్రముఖుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఈ వేడుకలు జరిగాయి.

### కసుమూరు దర్గాలో :

అదేవిధంగా జిల్లాలో ఎంతో ప్రముఖమైన కసుమూరు దర్గాలో మస్తాన్‌వలీ 243వ గంధమహోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కడప పీఠాధిపతి అరీఫుల్లా హుస్సేనీ దర్గాలోని మస్తాన్ వలీ సమాధిపై గంధలేపనం చేసి తహలీఫాతేహా కార్యక్రమం నిర్వహించిన తర్వాత భక్తులకు గంధం, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితర ప్రముఖులంతా విచ్చేసి దర్గాను దర్శించుకుని ప్రార్థనలు చేసుకున్నారు. దర్గా ముజావర్ల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేసి ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

# చెరువుల బాగుకు నిధులు

జిల్లాలో రైల్వేలైన్లకు సమీపంలో ఉన్న చెరువులను బాగు చేసి పటిష్టవంతం చేసేందుకు నిధులు మంజూరుచేస్తూ నీటిపారుదల శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. కావలి నుంచి గూడూరు దాకా రైలుమార్గం పరిసరాల్లో ఉన్న తొమ్మిది చెరువులకు 6 కోట్లా 41 లక్షలా 25వేల రూపాయల నిధిని కేటాయించారు. బ్రాహ్మణక్రాకలోని నాయుడు చెరువుకు 2 కోట్లు, లింగరాజు అగ్రహారం చెరువుకు కోటీ 50 లక్షలు, బిట్రగుంట పరిధిలోని బుడమగుంటలోని పెద్దచెరువుకు, గౌరవరం కొత్త చెరువుకు 20.20 లక్షలు, పాత బిట్రగుంట ఈస్ట్ ట్యాంక్‌కు 61.20 లక్షలు, దగదర్తి నారాయణ పురం చెరువుకు 30 లక్షలు, కాట్రాయిపాడు చెరువుకు 25 లక్షలు, పడమర గూడూరు మర్రిపల్లిమడుగుకు 44 లక్షలు, గూడూరు డివిజన్‌లోని దివిపాళెం చెరువుకు 11.25 లక్షలు కేటాయించారు.

# వింజమూరులో నాడు-నేడు పనుల పరిశీలన

వింజమూరు పంచాయతీ పరిధిలోని బిసి కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఈనెల 17న మండల ప్రత్యేకాధికారి టి.కిశోర్‌బాబు పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

## కార్తీకేశ్వరా! నమో నమః



సీ!! కార్తీక మాసాన కైలాస గిరి వీడి
కుంభిని కరుదెంచి కూర్మితోడ
అభిషేకములనంది ఆనందమందుచు
అవని జనులనెల్ల నలరజేయు
రజతాద్రివాసుండు రమణీయ రూపుండు
పార్వతీనాధుండు పరమశివుడు
కంఠాన గరళమ్ము కరమున శూలమ్ము
బాహువులందున పాపరేండ్లు
వేడ్క నందీశుండు వెంట రా ఢమరమ్ము
పలికించి భక్తాళి భయము బాపు!
తే.గీ : తలప హరిహర శక్తులు తానె యగుచు
ఆర్తి పోకార్చి శిష్టుల నాదరించు
భవుని పాదముల్ ప్రార్థించు ప్రణతులిడుచు
అవని జేరగ భజియింతు అంజలింతు!....

- వనం సుబ్రహ్మణ్యం, ఫోన్ : 9449594897

Please note the change
www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

# చంద్రుడు తపస్సు చేసిన క్షేత్రం.. సోమేశ్వరాలయం

***ప**చ్చనిచెట్లు, రమణీయమైన ప్రకృతి సోయగాల మధ్య, సోమశిల జలాశయం సమీపంలో ఆహ్లాదకరమైన పల్లె వాతావరణంలో అత్యద్భుతంగా తీర్చిదిద్దినట్లుండే సోమేశ్వరాలయం ప్రాచీనకాలం నుంచి భక్తులకు కొంగుబంగారంగా ఉంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోని అనంతసాగరం మండలం సోమశిలలో ఉన్న ఈ ఆలయం.. జిల్లాలో ప్రఖ్యాతమైన శివాలయంగా, దక్షిణ కాశిగా ఎంతో ప్రఖ్యాతిగాంచింది. ఆ పరమేశ్వరుడే స్వయంభువుగా ఇక్కడ వెలసినట్లు ప్రతీతి. అంతేకాదు ఇది చంద్రుడు తపమాచరించిన పుణ్యక్షేత్రంగా కూడా ప్రసిద్ధి.*





మన దేవాలయాలు 21

నిరంతరం శివ నామస్మరణలతో మార్మోగుతూ, నిత్య ధూప దీప నైవేద్యాలతో అలరారుతూ ఉండే పవిత్రమైన శివక్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన ఆలయం.. సోమేశ్వరాలయం. సాక్షాత్తూ ఆ పరమేశ్వరుడే స్వయంభువుగా వెలసిన క్షేత్రమిది. ప్రకృతిమాత ఒడిలో అలరారే ఈ మహిమాన్వితమైన ఆలయ ఆవిర్భావం గురించి ఎంతోకాలం నాటి ప్రాచీన చరిత్రతో పాటు ఎంతో ఆసక్తికరమైన పురాణ కథనాలు కూడా ఉన్నాయి.

### పరమశివుని అనుగ్రహం కోసం చంద్రుని తపస్సు

పురాణ కథనం ప్రకారం.. గురుపత్ని శాపంతో కళావిహీనుడైన చంద్రుడు, ఆ శాపం నుంచి విముక్తి పొందడానికి నారద మహాముని సూచన మేరకు భూలోకంలో పెన్నానది తీరంలో ఉన్న పరమేశ్వరుని పూజించి ఆ శివుని అనుగ్రహంతో శాప విముక్తి పొందాడని చెప్తుంటారు. అందుకే ఈ క్షేత్రానికి సోమేశ్వరాలయం అనే పేరు వచ్చిందని, ఈ ఆలయం పేరుతోనే ఈ ప్రాంతానికి సోమశిల అని పేరు కూడా వచ్చిందని అంటారు.

ప్రాచీన చరిత్ర ప్రకారం.. ఇది విక్రమాదిత్యుని కాలం నాటి ఆలయమని అంటుంటారు. పూర్వకాలంలో మాల్యవంత పర్వతాలకు ఆవలివైపున ఉన్న విక్రమాదిత్యుడి రాజ్యంలోని గోవులు ఈ ప్రాంతానికి మేతకు వచ్చేవి. అందులోని ఒక గోవు నిత్యం పాలు ఇవ్వకపోవడాన్ని గమనించిన రాజు పశువుల కాపరిని దండించగా, అభం శుభం తెలియని ఆ కాపరి ఆ గోవును వెంబడించి ఒక పుట్టలో ఉన్న పసిబాలుడికి ఆ గోవు పాలు వదులుతుండడం, కాపరి వచ్చిన అలికిడికి భయంతో పుట్టమీద కాలువేసి వెళ్లిపోవడంతో పుట్ట చెదరిపోయింది. కాపరి ఈ విషయం రాజుకు చెప్పాడు. రాజు భటులతో వచ్చి ఆ పుట్టను తవ్విచూస్తే అక్కడ ఒక శివలింగం కనిపించింది. ఇదెంతో మహిమాన్వితమైనదని గ్రహించిన రాజు ఆ శివలింగాన్ని తీసుకువచ్చి రాజ్యంలో ప్రతిష్ఠించాలని భటులను ఆజ్ఞాపించాడు. అయితే భటులెంతగా తవ్వినా శివలింగం కదలకపోవడంతో రాజు విస్మయం చెందుతుండగా ఆ పరమేశ్వరుడే ఒక సాధువు రూపంలో వచ్చి ఇది స్వయంభువు అని, పరమేశ్వరుని రూపమని, ఈ మహిమాన్వితమైన శివలింగాన్ని పెకలించడం ఎవరికీ సాధ్యం కాదని, ఇక్కడే ఆలయం నిర్మించాలని చెప్పగా విక్రమాదిత్యుడు ఇక్కడ అత్యద్భుతమైన రీతిలో ఈ ఆలయం నిర్మించాడని అంటారు. అందుకు నిదర్శనంగా ఇప్పటికీ ఇక్కడ ఉన్న శివలింగం పుట్టలో ఉన్నట్లుగా భూమికి కొన్ని అడుగుల కిందే ఉంటుంది. శివలింగంపై గోపాద ముద్ర కూడా ఉండడం విశేషం. నాటి ప్రాచీన కాలంలో గండ శిలలతో ఎంతో కళాత్మకంగా నిర్మించిన ఈ అపురూప ఆలయం జిల్లాలోని అత్యంత ప్రాచీనమైన శైవక్షేత్రంగా ప్రసిద్ధి. ఆలయ ధ్వజస్తంభం కూడా ఇక్కడ అత్యంత పెద్దదిగా ఉండడం విశేషం.

### కార్తీకమాసంలో మరింతగా దేదీప్యమానం

భక్తులు కోరిన కోరికలు నెరవేర్చే దైవంగా సోమశిల సోమేశ్వరుడు నిరంతరం భక్తుల పూజలందుకుంటూనే ఉన్నాడు. ప్రత్యేకించి ఈ ఆలయంలో కార్తీకమాసంలో సోమేశ్వరస్వామికి జరిగే విశిష్టపూజలు ఎంతో ప్రసిద్ధి. శివరాత్రి ఉత్సవాల రోజుల్లో ఈ ఆలయం మరింత దేదీప్యమానంగా వెలుగొందుతూ ఉంటుంది. ఈ ఆలయంలో కామాక్షీ దేవి అమ్మవారి గుడి, నవగ్రహాల మందిరం కూడా ఉన్నాయి. ఎంతో అపురూపమైన నాగశిలలు కూడా ఇక్కడ ఉన్నాయి. వీటికి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తే ఎంతటి దోషాలైనా వీడిపోతాయని భక్తులు చెప్తుంటారు. ఆలయం ముందున్న రావిచెట్టు సుమారు 250 సంవత్సరాల నాటిదని, అయినా ఈ చెట్టు నేటికీ అక్కడున్న గాలిగోపురాన్ని మించి ఎదగకపోవడం ఆ పరమేశ్వరుని మహిమలకు నిదర్శనమని ఇక్కడి పెద్దలు చెప్తుంటారు. ఎత్తయిన గాలిగోపురం, ఎంతో గొప్ప ధ్వజస్తంభం, నంది విగ్రహం భక్తులందరినీ విశేషంగా ఆకట్టుకుంటూ ఉంటాయి. జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన సోమశిల జలాశయానికి నిత్యం పర్యాటకులు వస్తుంటారు. వారంతా తప్పనిసరిగా ఇక్కడున్న సోమేశ్వరాలయాన్ని కూడా దర్శించుకుని తరిస్తుంటారు.

# తెగని పంచాయితి

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల జరపాలనే నిర్ణయానికొచ్చాడు. అయితే ఆయన నిర్ణయాన్ని మొదటినుండి ఆంధ్రా ప్రభుత్వం వ్యతిరేకిస్తూనే ఉంది. కరోనా రెండవ దశ విస్తరించే ప్రమాద ముందని అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు హెచ్చరించడం, ఇప్పటికే కొన్ని దేశాల్లో కోవిడ్ విస్తరించి లాక్‌డౌన్ దిశగా ఆ దేశాలు అడుగులు వేస్తున్న తరుణంలో ఎన్నికలు జరపడం అసాధ్యమని రాష్ట్ర ప్రభుత్వం చెప్పేసింది.

### అనుమానాలకు బలం చేకూరుస్తున్న నిమ్మగడ్డ

రాష్ట్ర ప్రభుత్వం అభీష్టానికి వ్యతిరేకంగా సాధ్యాసాధ్యాలను పరిగణనలోకి తీసుకోకుండా, సెలవులో ఉన్నవాడు సైతం నవంబర్ 17వతేదీ మంగళవారం విధులకు హాజరై, ఫిబ్రవరిలో స్థానిక పోరు జరపాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించిందని, రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించాక షెడ్యూలు ఖరారుచేసి నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించి, అంతర్జాలంలో పొందుపరచడంతో పాటు ప్రకటన కూడా విడుదల చేశాడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్. హుటాహుటిన ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చేశాడు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రభుత్వ యంత్రాంగం సహకారంతో నిర్వహించాల్సిన ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన విషయంలో ముందుగా ప్రొసీడింగ్స్ ఇచ్చేసి ప్రకటన చేయడాన్ని గమనిస్తే, ఆయన పోకడ అనుమానాలకు తావిస్తుందన్నది రాజకీయ మేధావుల అభిప్రాయం. చంద్రబాబు డైరెక్షన్లో ఎన్నికల కమిషన్ పని చేస్తోందన్న వైసిపి నాయకుల ఆరోపణలకు నిమ్మగడ్డ ప్రవర్తన బలాన్ని చేకూరుస్తోందన్నది కూడా వారి విశ్లేషణ.

ఇప్పట్లో ఎన్నికలు సాధ్యం కాదని చెప్పేశాం కాబట్టి, ఈ అంశానికి సంబంధించి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం ఏర్పాటు చేయాలన్న నిమ్మగడ్డ ప్రతిపాదనను కూడా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని కొట్టిపడేసింది. అసలు ఎన్నికలే అసాధ్యం అంటుంటే ఇప్పుడు వీడియో సమావేశాలేంటన్నది ఆమె అభిప్రాయం. విషయం బాగా ముదిరింది. నిమ్మగడ్డ ఎన్నికలు పెట్టాల్సిందే అంటున్నాడు, ప్రభత్వం ససేమిరా అంటోంది. ఈ విషయమై 18వతేదీ బుధవారం రమేష్ కుమార్ గవర్నర్‌ని కలిశాడు. జరిగింది, జరుగుతోంది వివరించాడు. ఇప్పుడు బాల్ గవర్నర్ కోర్టులోకి వెళ్ళింది. ఎన్నికలు పెట్టమని రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తాడా? లేక నిపుణుల సలహా తీసుకుంటాడా..?? కోర్టులో తేల్చుకోమంటాడా...??? అన్నది ఇప్పుడు ప్రశ్న. గవర్నర్ ఎలా స్పందిస్తాడో వేచి చూడాల్సిందే. మొత్తానికి ఇప్పటికైతే ఈ ఎన్నికల వ్యవహారం 'తెగని పంచాయతీ' గానే మిగిలిపోయింది....!


# గరం గరం.. పోలవరం

(మొదటి పేజీ తరువాయి)

గ్రామాలకు త్రాగు నీరు అందించడంతో పాటు బహుళ ప్రయోజనాలు కలిగిన ప్రాజెక్టుగా పోలవరానికి రూపకల్పన చేశారు నాటి మేధావులు. ఇప్పుడు స్వార్థపూరిత రాజకీయాల కోసం వ్యక్తిగత ప్రాభవం కోసం పోలవరాన్ని వేదికగా చేసుకుని పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తున్నారు తెలుగు నాయకులు. 2014 నుండి 2019 వరకు రాష్ట్రాన్ని పాలించిన తెలుగు తమ్ముళ్లు ఢిల్లీ పెద్దల అండతో పోలవరాన్ని అడ్డంపెట్టుకుని కోట్ల రూపాయలు మింగిన విషయాన్ని మర్చిపోయినట్టున్నారు. తమ ఇష్టానుసారం అంచనాలను పెంచుకుని వాటాలు పంచుకున్న సంగతిని విస్మరించినట్టున్నారు.

పోలవరం విషయాన్ని క్రికెట్టు బెట్టింగులతో, పబ్జి గేములతో పోల్చి ప్రాజెక్టు స్థాయిని దిగజార్చే స్థాయిలో మాజీమంత్రి దేవినేని ఉమ మాట్లాడుతున్నాడంటే ఆయన మానసిక స్థితి, అధికారంలో లేమన్న బాధ ఏ స్థాయిలో ఉన్నాయో మనం ఊహించుకోవచ్చు. వారి పాలనలో చేసుకున్న లావాదేవీలను, కుదుర్చుకున్న ఒప్పందాలను బయటకు పొక్కనీయకుండా విషయాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నంలో అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తున్నాడన్నది స్పష్టమైపోతుంది. ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తున్నారంటూ కొత్త వివాదాన్ని తెరపైకి తెచ్చాడు. అందుకు ధీటుగానే స్పందించిన నీళ్ల మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ కావాలంటే టేపు తెచ్చి అంగుళం అంగుళం కొలుచుకో అంటూ సమాధానం చెప్పాడు. పబ్జిలు, క్రికెట్టులు ఆడుకుంటున్నామని మమ్మల్ని విమర్శిస్తున్న నువ్వు, మీ నాయకుడు లోపాయకారి ఒప్పందం కుదుర్చుకుని కోట్లు మింగేస్తున్నప్పుడు చెమ్మా చెక్కా ఆడుకుంటున్నావా..? 2017లో కేంద్ర క్యాబినెట్ సమావేశంలో జరిగిన ఒప్పందాలకు గంగిరెద్దులా మీ నాయకుడు తలూపినప్పుడు నువ్వేమైపోయావు అంటూ గట్టిగానే వాయించాడు. పనిలో పనిగా ఆంధ్రా భాజపా అధ్యక్షుడు సోము వీర్రాజు కుడా ఈ విషయంలో జోక్యం చేసుకుని అసలు పోలవరంకి నిధులు ఇచ్చిన భారతీయ జనతా పార్టీ గురించి మీరెవరూ మాట్లాడారేంటి అంటూ ధ్వజమెత్తాడు ...!

భావితరాలకు జీవం పోసే అత్యంత అద్భుతమైన పోలవరాన్ని తమ రాజకీయ ప్రాబల్యం, ప్రచారం కోసం గోలవరంగా మార్చకుండా, ఎత్తులు, జిత్తులు, పైఎత్తులు మాని విజ్ఞతతో వ్యవహరించి ప్రజలకు ప్రయోజనాలు చేకూర్చే ఇలాంటి ప్రాజెక్టుల విషయంలో రాజకీయాలను పక్కన పెట్టి ప్రజా శ్రేయస్సుకి ప్రాధాన్యతనివ్వాలని అన్ని పార్టీల నాయకులకు తెలుగోళ్ళ విజ్ఞప్తి.



## సినీ నిర్మాత జయరాజ్..

# అమెరికాలో కన్నుమూత



మన నెల్లూరీయుడు, నెల్లూరు సంతపేట నివాసి, 'కృష్ణ గారి అబ్బాయి' సినిమా నిర్మాత సముద్రాల జయరాజ్(76) ఈనెల6న అమెరికాలోని న్యూయార్క్‌లో కన్ను మూశాడు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. గత కొద్దికాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ గుండె సంబంధిత సమస్యతో చికిత్స పొందుతూ అక్కడి ఆసుపత్రిలోనే మృతిచెందాడు. న్యూయార్క్‌లో పేథాలజీ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసే జయరాజ్‌కు స్నేహితులంటే అభిమానం. కొంతకాలం సౌదీఅరేబియాలో ఉన్నా, ఎంతోకాలంగా అమెరికాలో ఉంటున్నా నెల్లూరంటే ఎంతో ఇష్టం, నెల్లూరులోని మిత్రులన్నా ఇంకా ఎంతో అభిమానం. తాను కష్టపడి సంపాదించిన దాంట్లో అధికభాగాన్ని బంధుమిత్రులకు సాయంగా ఇచ్చేసే సౌజన్యమూర్తి. ఎంతో స్నేహాభిలాషి, ఉదార స్వభావుడైన జయరాజ్ మృతికి సంతాపం ప్రకటిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తోంది 'లాయర్'.

# కళ్యాణ వైభవం...!




రేడియోగ్రాఫర్‌గా జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు వివిధ ప్రాంతాలలో పనిచేసి, ప్రస్తుతం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న చిల్లిముంత రవిశేఖర్‌బాబు - పద్మకుమారిల ఏకైక కుమారుడు సరోజ్ కిషన్ - అలేఖ్య (ఈపూరు విజయబాబు - లక్ష్మీనారాయణమ్మల కుమార్తె )ల కళ్యాణం ఇటీవల నెల్లూరులో జరిగింది. నవ దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# పెచ్చుమీరిపోతున్న రౌడీమూకల ఆగడాలు

## నిఘా వ్యవస్థ ఏమైంది.. వైకాపాకు వత్తాసుగా పనిచేస్తోందా?

**- టిడిపి నాయకుడు కోటంరెడ్డి శీనయ్య ధ్వజం**



ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే నెల్లూరు నగరంలో వైకాపా నాయకుల అండతో రౌడీమూకలు రెచ్చిపోతుంటే నిఘా వ్యవస్థ ఏం చేస్తోంది?..అధికారపార్టీ నాయకులకు తొత్తుగా పనిచేస్తోందా అంటూ నెల్లూరు నగర టిడిపి ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మండిపడ్డాడు. ఈనెల 18న ఆయన నెల్లూరులోన టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరు నగరంలో రౌడీలు రాజ్యమేలుతున్నా పోలీసులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించాడు. నగరంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయని, టిడిపి వారిని వేధించడానికి అక్రమకేసులు బనాయించడానికి చూస్తున్నారే తప్ప నగరంలో పరిస్థితులను పోలీసులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. స్కూలుకు వెళ్ళే బాలికల దగ్గర నుంచి ఆఫీసులకెళ్లే మహిళల దాకా ఎవరు కనిపించినా వైకాపా రౌడీలు వేధిస్తున్నారని, క్రికెట్ బెట్టింగ్‌లను అరికట్టడంలో జిల్లా ఎస్పీ విఫలమయ్యారని ఆరోపించాడు. ఇటీవల క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో ఒక యువకుడిని రౌడీలు చితకబాదినా పోలీసులు నిర్లిప్తంగానే ఉంటున్నారని, ఇలా వెలుగులోకి రాని రౌడీ దాడుల సంఘటనలు ఎన్నో ఉన్నాయని, ఇంత జరుగుతున్నా జిల్లా ఎస్పీ పట్టించుకోకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించాడు. నెల్లూర్ మరో బీహార్ అవుతుందేమోనని, ఇప్పటికైనా రౌడీమూకలను అరికట్టాలన్నాడు. పోలీసులతో మాట్లాడదామని టిడిపి నాయకులు ఫోన్ చేస్తే నగరంలోని సిఐలు ఫోన్లు ఎత్తడం లేదన్నాడు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ధర్మవరపు సుబ్బారావు, పిట్టి సత్యనాగేశ్వరరావు, మామిడాల మధు, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, కప్పిర శ్రీనివాసులు, జహీర్, ఆకుల హనుమంతు, జాఫర్, కృష్ణసాయి పాల్గొన్నారు.

# గోపాలస్వామి సేవలు చిరస్మరణీయం

**జర్నలిస్టుల నివాళి**




ఏపి యుండబ్ల్యు మాజీ అధ్యక్షుడు, అటు ప్రజలకు ఇటు జర్నలిస్టులకు సేవలందించిన మానవీయమూర్తి పివివి గోపాలస్వామి సేవలను వక్తలు కొనియాడారు. ఈనెల 18న నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో గోపాలస్వామి సంతాపసభ జరిగింది. జర్నలిస్టులు గోపాలస్వామి సేవలను గుర్తుకు తెచ్చుకుంటూ ఆయనకు నివాళులర్పించారు. ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్ మాట్లాడుతూ 1978-81 సంవత్సరాల్లో గోపాలస్వామి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టుల యూనియన్‌కి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారని, ఆయన భార్య రాధాదేవి పేరుతో విలేకరులకు అవార్డులు కూడా ఇచ్చేవారని చెప్పారు. జీవితాంతం జర్నలిస్టుల సంక్షేమానికి కృషిచేసిన ఆయన సేవలు చిరస్మరణీయమైన వన్నారు.

ఈ సభలో స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మూర్తి, హనోక్, దయాశంకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వీక్షణం
- మంజీర

2020

# వారసుల రాజకీయ చిత్రం

ప్రపంచాన్ని ఈ ఏడాది ఆవరించినంత స్తబ్దత మరే సంవత్సరమూ సంభవించి ఉండదు. కోవిడ్-19 కాలాన్ని సందిగ్ధంలో పడేసింది. కరోనా మహమ్మారి 2020ని ఒక తరమంతా మర్చిపోలేని చేదు జ్ఞాపకంగా మిగిల్చింది. ఇంత ఘోరమైన అనిశ్చితిలో మన దేశం ఒక నిశ్శబ్ద విప్లవానికి వేదిక అయింది. ఈ నెలలో జరిగిన ఎన్నికల్లో కొత్తతరం తన ప్రతిభను చాటుకుంది. గెలుపు ఓటములను నిర్ణయించే నిర్ణాయక శక్తిగా నిలిచింది. ఉదాహరణలు ఒకటి కాదు రెండు కాదు. తెలుగు రాష్ట్రాల్లో చెరుకు శ్రీనివాసరెడ్డి నుంచి ఉత్తరాదిన జ్యోతిరాదిత్య సింధియా, చిరాగ్ పాశ్వాన్, తేజస్వియాదవ్, ఒవైసీ రాజకీయ చిత్రపటంలో ప్రముఖంగా చోటుచేసుకున్నారు.

తెలంగాణ, దుబ్బాక అసెంబ్లీ నియోజక వర్గంలో గెలిచింది బీజేపీయే కానీ గెలుపు వెనుక కీలక శక్తి చెరుకు శ్రీనివాసరెడ్డి సాహసోపేతమైన నిర్ణయమే. శ్రీనివాసరెడ్డికి ఇది రాజకీయ ఆరంగేట్రం. టీఆర్ఎస్ తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వని కారణంగా... ఓటమి తప్పదని తెలుస్తూనే కాంగ్రెస్‌పార్టీలో చేరి తనను తాను నియోజకవర్గ నాయకుడిగా మలుచుకున్నాడు. శ్రీనివాసరెడ్డి తండ్రి ముత్యంరెడ్డి సొంతూరు తుక్కాపూర్‌కి పద్దెనిమిదేళ్లు సర్పంచ్. నాలుగు దఫాలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు కూడా. దుబ్బాక గ్రామీణ నియోజకవర్గం. అభివృద్ధి పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తూ నియోజకవర్గం మొత్తానికి ఒకేరకమైన బస్‌షెల్టర్‌లు కట్టించి, నాణ్యమైన రోడ్లు వేయించారాయన. ముత్యంరెడ్డి గత ఏడాది సెప్టెంబర్‌లో మరణించారు. టీఆర్ఎస్ నుంచి ఎటువంటి హామీ లభించని పరిస్థితిలో ఈ ఏడాది ఎన్నికల్లో మౌనం వహిస్తే తన రాజకీయ వారసత్వానికి గ్రహణం పడుతుందని గ్రహించిన శ్రీనివాసరెడ్డి ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి పోటీలో నిలిచాడు. జవజీవాలు కోల్పోయిన కాంగ్రెస్ పార్టీలో చేరి 22 వేల ఓట్లు తెచ్చుకుని 'ఇదీ నా శక్తి' అని నిరూపించాడు. జీరోను కాదు హీరోనే అనిపించుకున్నాడు.

## సినిమా చూపించిన హీరో

తెలంగాణ ఉప ఎన్నిక ఇలా ఉంటే... బీహార్ జనరల్ ఎలక్షన్స్‌లో పార్లమెంట్ సభ్యుడు చిరాగ్ పాశ్వాన్ బీహార్ రాజకీయ చిత్రపటంలో ప్రధాన భూమిక పోషించాడు. చిరాగ్ పాశ్వాన్ అనగానే దక్షిణాది వాళ్లకు మొదట రామ్‌విలాస్ పాశ్వాన్ గుర్తుకొచ్చే మాట నిజమే. యువ పాశ్వాన్ 'మిలే నా మిలే హమ్' సినిమా హీరో కూడా. ఎన్నికల నగారా మోగేనాటికి ఎన్‌డీఏలో కలిసి ఉన్న వాడు కాస్తా 'కలిసినా కలవకున్నా' అంటూ విడిపోయి 75 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టాడు. గెలిచింది ఒక్క స్థానమే. అయితే యాభై చోట్ల నితీశ్‌కుమార్‌కు సినిమా చూపించాడు. జేడీయూ సీట్లు తగ్గడానికి కారణమయ్యాడు. బీజేపీ ఆధిక్యత సాధించడానికి పరోక్షంగా కారకుడైన చిరాగ్... తండ్రి మరణంతో కేంద్రంలో ఖాళీ అయిన మంత్రి పదవిని కూడా కోరుకోవడం లేదు. ఈ చర్యతో ఏం సాధించారని అడిగిన జాతీయ మీడియాతో '2025లో ముఖ్యమంత్రి కావడానికి వేసిన తొలి అడుగు' అని ఓ చిరునవ్వు నవ్వాడు. ట్వంటీ ట్వంటీ మ్యాచ్‌ను తలపించిన ఈ దఫా బీహార్ ఎన్నికలు... రాబోయే ఐదేళ్ల కోసం చిరాగ్ తనకు తాను వేసుకున్న తివాచీ, కాగా తేజస్వి యాదవ్‌కి మాత్రం పదవి అందినట్లే కనిపించి అందకుండా జారిపోయి కాళ్ల కింద తివాచీని లాగేశాయి. అమ్మానాన్నలు లాలూ ప్రసాద్‌యాదవ్, రబ్రీ దేవి ఇద్దరూ రాష్ట్రానికి మాజీ ముఖ్యమంత్రులే. ఇక తాను ముఖ్యమంత్రి బరిలో నిలవాల్సిన సమయం ఆసన్నమైందని గ్రహించడంతోపాటు గట్టి వారసుడే అనే ముద్ర వేయించుకోగలిగాడు తేజస్వి. అయితే తేజస్వి తేజానికి పట్టిన గ్రహణం మాత్రం నెహ్రూ కుటుంబ వారసుడు రాహుల్ గాంధీ అనే చెప్పాలి. మారథాన్ పరుగులో తేజస్వి కాలికి చుట్టుకున్న ఓ ఇనుపగుండులా మారింది కాంగ్రెస్‌పార్టీ.

## వారసత్వ 'గుణ'కారం

బీజేపీకి దక్కిన మరో విజయం సింధియా ప్రసాదమే. మధ్యప్రదేశ్‌లో మార్చి ముసలం జ్యోతిరాదిత్య సింధియాను కాంగ్రెస్‌కు దూరం చేసింది. అధికారం 'చే'జారి కమలం వికసించింది. సింధియాల ఈ తరం వారసుడు తండ్రి మాధవ్‌రావ్ నియోజకవర్గం 'గుణ' నుంచి 2002లో బీజేపీని ఓడించి పార్లమెంట్‌కు ఎన్నికయ్యాడు. స్థానభ్రంశం చెంది ఓ సున్నా చివరికొచ్చి ఈ 2020 నాటికి రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కీలకం అయ్యాడు. మార్చిలో రాజీనామా చేసిన తన అనుచరులను కమలం గుర్తు మీద గెలిపించుకుని పోరాటపటిమను చాటుకున్నాడు. రాబోయే ఎన్నికలకు ముఖ్యమంత్రి అభ్యర్థిని తానేనని చెప్పకనే చెప్పుకున్నాడు.

## ఉత్తరాదిలో పాతబస్తీ వారసత్వం

ఎంఐఎం నాయకుడు వారసత్వంగా రాజకీయ రంగ ప్రవేశం దశాబ్దాలు అయింది. అయితే పేరుకే జాతీయ పార్టీ, క్రియాశీలకంగా హైదరాబాద్ పాతబస్తీకే పరిమితం అనే ముద్రను చెరిపేసుకోవడం గత ఏడాది మొదలైంది. ఈ ఏడాది బీహార్‌లో ఐదు స్థానాలను గెలిచి దేశం గుర్తించే విజయాన్ని సాధించింది. ఈ కరోనా ఏడాది జరిగిన ఎన్నికల్లో దేశ రాజకీయ యవనిక మీదకు వచ్చిన వారసులు వీళ్లంతా. ఈ ఏడాది... రాబోయే ఏడాదికి తమిళనాడు ఎన్నికలకు కూడా మరో వారసుడిని తెర మీదకు తెచ్చింది. కరుణానిధి కొత్త వారసుడు అళగిరి రాజకీయ ప్రస్థానం ఏ తీరాన్ని చేరుతుందో చూడాలి.

# రైతు భరోసా కేంద్రం తనిఖీ

గుంటూరు ఉద్యానశాఖ కమిషనరేట్ ఓఎస్డీ డి. రమేష్ ఈనెల18న నెల్లూరు రూరల్ మండలంలోని ఆమంచర్లలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడిఏ బాలాజీనాయక్, నెల్లూరు మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నారాణి పాల్గొన్నారు.

Please note the change

www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

## శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానెల్

# నిర్వహణాధికారులకు విన్నపాలు

"వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తికించన ।
వేంకటేశ సమో దేవో నభూతో నభవిష్యతి ॥"

నిత్యకళ్యాణ చక్రవర్తైన శ్రీ వేంకటేశ్వరుడికి సరిసమాన దైవం, వేంకట్రాదికి సరితూగగల పుణ్యక్షేత్రం, ముల్లోకాలలో భూత కాలంలో, భవిష్యత్తులో ఉండబోదు. ఇది జగమెరిగిన సత్యం. స్వామివారి క్షేత్రమైనా, స్వామివారి దర్శనమైనా, స్వామివారి పేర నిర్వహిస్తున్న విద్యాసంస్థలైనా, వైద్యసంస్థలైనా, వేద పాఠశాలలైనా, అన్న ప్రసాద వితరణలైనా... ఏదైనా, పరమపవిత్రంగా అత్యంత భక్తిశ్రద్ధలతో తితిదే వారు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే తితిదే వారు సమున్నత మయిన ఆలోచనతో హిందూ ధర్మప్రచార పరిషత్‌ను స్థాపన చేసి తద్వారా హైందవం, హైందవ ధర్మం మీద అవగాహన కల్పించే అనేక కార్యక్రమాలు చేపట్టారు. హైందవానికి ఆయువుపట్టు అయిన వేద విద్యను ప్రోత్సహించారు. వేద పాఠశాలలు – అందుకు తగ్గ వేదగురువులు – వేద విద్యకు ప్రామాణికాలు ఏర్పాటు చేశారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు, జ్ఞాన విజ్ఞానాలకు వివిధ ధర్మాలకూ దర్శన సదాచారాలకు, సాహిత్యానికి మూలమైనది వేదం. మానవజాతి చరిత్రకు తొలి పాఠ్యగ్రంథంగా ప్రపంచ వాఙ్మయంలోనే ప్రథమమైనదిగా ప్రస్తుతింపబడుతున్నది వేదం. వేద వేదాంగాలను ఈనాటి తరం అధ్యయనం చేయగల స్థితిలో స్థాయిలో లేదు. అధ్యయనమే కష్టమైనపుడు అవగాహనకు ఆస్కారమెక్కడిది?.

హిందూధర్మాన్ని పరివ్యాప్తం చేయడానికి నేటి అధునిక సాంకేతికత కలిసివచ్చింది. శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానెల్‌ను ఆవిష్కరించారు. ఈ దృశ్యశ్రవణ మాధ్యమం ద్వారా మన వాఙ్మయ సంపదను అందరికీ అవగతమయ్యే పద్ధతిలో, మహామహులు, ఆధ్యాత్మిక మార్గంలో నిష్ణాతులయిన కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర స్వామివారు, శ్రీ శృంగేరి భారతీతీర్థ స్వామివారు, శ్రీ త్రిదండి చిన జీయర్ స్వామి వారు, కుర్తాళం శ్రీ సిద్దేశ్వరానంద భారతీ స్వామివారు, పరిపూర్ణనంద స్వామి వారి వంటి తపోధనుల బోధనలు మనకు మార్గదర్శకాలు. బ్రహ్మశ్రీలు మల్లాది చంద్రశేఖర శాస్త్రి, కందాడై రామానుజాచార్య, చాగంటి కోటేశ్వరరావు, సామవేదం షణ్ముఖశర్మ గార్ల అనుగ్రహ భాషణాలను, ప్రవచనాలను, మార్గదర్శకాలను, శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానెల్ అందరికి సునాయాసంగా చేరవేసే బాధ్యత వహిస్తోంది.

సామాన్యజనానికి, ఈ ఛానెల్ ద్వారా ఎన్నో పురాణాలను, ఇతిహాసాలను అందులోని ధర్మసూక్ష్మాలను, ఆదర్శాలను మన సంప్రదాయ సదాచారాలను, మన సాహితీ విలువలను, సంగీతపరమైన కీర్తనలను, ప్రాచీన వైద్య విధానాలను అవగతం అయ్యేట్లుగా చేయగలిగే అవకాశం కలిగింది. ఈ మాధ్యమాన్ని అత్యంత శ్రద్ధతో, భక్తితో నిర్వహించి వాడుకోగలిగితే హైందవానికి శాశ్వతమైన, దృఢతరమైన పునాదులు పునర్నిర్మించవచ్చు.

ఈ ఛానెల్ ప్రారంభదశలో అనుకున్న ప్రమాణాలు సాధిస్తూ పురోగమిస్తూ వచ్చింది. కానీ గత అయిదారేళ్ళుగా ఛానెల్‌లోని కొన్ని అరాచక, నీచ ప్రవృత్తి, సంస్కారహీనులైన కొద్దిమంది ఉద్యోగుల కారణంగా ఛానెల్ ప్రతిష్ట మసకబారడం మొదలయ్యింది. ఈ ఛానెల్ వ్యాపారపరమైంది కాదు. దీనికున్న ఏకైక లక్ష్యం హైందవానికి గురుస్థానం కల్పించడం. సమాజంలో భక్తి ప్రపత్తులు, శ్రద్ధ, నిబద్ధత, నిజాయితీ, సద్వర్తనం, సుసంస్కారం సౌజన్యం, సౌశీల్యం పెంపొందించడం. అలాంటి పవిత్ర లక్ష్యాలున్న ఛానెల్‌కు ఏ లౌకిక పరమైన యజమానీ మనకు ఉండరు, ఒక్క శ్రీ వేంకటేశ్వరుడు తప్ప!.

సాక్షాత్ స్వామివారే యజమానిగా సాగుతున్న ఈ ఛానెల్ ఎంత పవిత్రమో, ఎంత విలువైనదో ఎంత ఆవశ్యకమైనదో మనందరికీ తెలుసు. అలాంటి పవిత్ర కార్యం నిర్వహించడానికి కావలసిన ఉద్యోగులు అంతే పవిత్రతా భావం, ఆధ్యాత్మిక స్పర్శ, ధర్మాచరణం పట్ల మక్కువ కలిగినవారు అయివుండాలి. కేవలం డిగ్రీలు, డిప్లమోలు, సర్టిఫికెట్లు కాదు. నేరాలు – ఘోరాలు, కిరాతకాలు, బుల్లితెరమీద చూపించగలిగిన కుహనా మేధావులు, వృత్తి నిపుణులు కాదు ఈ సేవకుపయుక్తమయ్యే ఉద్యోగులు. ఉద్యోగ నియామకం దశలోనే ఈ జాగ్రత్తలు తీసుకోవలసింది. ప్రారంభదశలో భక్తి, సంప్రదాయం తెలిసినవారినే ఉద్యోగులుగా నియామకం చేశారు. కానీ, మధ్యకాలంలో, ఏ రాజకీయ నాయకుడి ప్రాభవంతోనో, ఏ ఇతరత్రా వంచనా మార్గంతోనో నీచప్రవృత్తి, నేరప్రవృత్తి, నీలి చిత్రాల భాగోతాల నిపుణులు ఈ ఛానెల్‌లో స్వామి సేవకులుగా చేరిపోయి, ఛానెల్ స్థాయికి, ప్రతిష్టకు మచ్చ తెస్తున్నారు.


ధర్మప్రచార పరిషత్‌లో ముఖ్యసమన్వయ బాధ్యతల కోసం నియమింపబడిన ఓ దుష్టశక్తి ఆగడాలకు అడ్డుఅదుపూ లేకుండా పోయినట్లు తెలుస్తోంది. తనకు ఎదురుచెప్పే అధికారులపైన ఈ వ్యక్తి అక్రమ అస్త్రాలు ప్రయోగిస్తున్నట్లు కూడా చెప్తున్నారు.

ఇటీవల గత వారంగా ప్రతిన్యూస్ ఛానెల్‌లో, స్వామివారి ఛానెల్‌లోని అధమాధముల వికృతచేష్టల మీద వార్తాకథనాలు పుంఖానుపుంఖాలుగా వస్తున్నాయి. మనసు కలతచెంది ఈ నాలుగు మాటలు వ్రాయవలసి వచ్చింది. సమయం ఆసన్నమైంది. దుష్టశిక్షణ జరగాలి. ధర్మ మార్గంలో లేని ఉద్యోగుల్ని గుర్తించి చీడపురుగులుగా భావించి వదిలించుకోవాలి. సరైన సంస్కారంలేని, సరైన భాష వాడని, మనదైన ధర్మాన్ని అనుసరించని వారిని అనర్హులుగా నిర్ణయించి ఉద్యోగం నుంచి తొలగించాలి. ఈ ప్రక్షాళన సత్వరం – అత్యవసరంగా జరగాలి.

ప్రస్తుతం ఈ ఛానెల్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అదనపు ఈ.వో. తితిదే శ్రీ ధర్మారెడ్డి గారు, పాలనాపరంగా చండశాసనులని విన్నాను. ఛానెల్‌కు పునర్వైభవాన్ని తీసుకురావాలని నడుంకట్టి, నిశ్చయాత్మకంగా ఉన్నారని తెలిసింది. ఆయన ఈ అస్తవ్యస్తాలకు కారణభూతులైన ఆషాడభూతులపై తన వజ్ర సంకల్పమే వజ్రాయుధంగా మలచి వేటువేయాలి. మంచిని, మర్యాదను, శిష్టాచారాన్ని, దైవత్వాన్ని నమ్మేవారిని గుర్తించి ప్రోత్సహించి వారికి తగిన బాధ్యతల నప్పగించి, ప్రజాబాహుళ్యానికి చెప్పవలసిన వాఙ్మయ సంపదను సులక్షణంగా, సుదర్శనంగా అందించాలి. వేదవేదాంగాలలో, పురాణేతిహాసాల్లో, నిష్ణాతులైన వారి సలహా సంప్రదింపులతో, సహకారంతో కార్యక్రమాలకు రూపకల్పన చేయించాలి. స్వామివారి ఛానెల్ హిమవత్పర్వతమంత ఉన్నతంగా హైందవ పతాకాన్ని రెపరెపలాడించాలి. ఛానెల్ కార్యక్రమాలు చూసిన ప్రతి హిందువూ ఆధ్యాత్మికతా భావంతో పులకరించి తరించాలి. ఆ మంచి తరుణం కోసం ఎదురుచూస్తున్న ఎందరో నాలాంటి వారి తరపున మీకిదే నా విన్నపం;

దేవస్థానాల పాలకమండలి ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి గారితో పాటు జవహర్‌రెడ్డి గారు, ధర్మారెడ్డి గారు నిర్ద్వంద్వంగా ఈ ప్రక్షాళనా కార్యక్రమం చేపట్టాలని ఈ బహిరంగ లేఖ ద్వారా తెలియబరుస్తున్నాను. అందుకు మీరందరూ సమర్థులు.

ఇటీవలే ఛానెల్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ సాయికృష్ణ యాచేంద్ర గారు సౌజన్యమూర్తి, సంగీత సాహిత్యాల మేలుకలయికల ప్రతిభామూర్తి. ఛానెల్‌లో పాలనాపరంగా మరియు నిర్వహణాపరంగా కావలసినంత కఠిన నిర్ణయాలను వారి సరళహృదయ నైజం కారణంగా తీసుకోలేరు. వారిని వినూత్న కార్యక్రమాల సృజనకే పరిమితం చేసి, ఛానెల్ నిర్వహణా బాధ్యతలు మీరే చేపట్టి, ఈ ఛానెల్‌కు పట్టిన ఆ గ్రహణాన్ని, రాహు కేతువుల వంటి మాయా గ్రహాల్ని తొలిగించి, పూర్వపు వెలుగులను – మరింత శోభలను తీసుకురండి.



**ఆవేదనతో, ఆర్తితో...**

**– కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి**
**వ్యవస్థాపక ఛైర్మన్, శాంతా బయోటెక్నిక్స్**

# మళ్ళీ సైకిలెక్కిన పనబాక లక్ష్మి



**మా**జీ కేంద్రమంత్రి, సీనియర్ రాజకీయవేత్త, నెల్లూరు కోడలు శ్రీమతి పనబాక లక్ష్మి మరోసారి సైకిలెక్కనుంది. తిరుపతి ఎంపి బల్లి దుర్గాప్రసాద్‌రావు ఆకస్మిక మరణంతో అక్కడ త్వరలో ఉపఎన్నిక జరగనుంది. ఎన్నికల వేళకు ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ తెలుగుదేశం పార్టీ ఇప్పటినుండే తమ ప్రయత్నాన్ని మొదలు పెట్టి అభ్యర్థిని ప్రకటించేసింది. 2019 ఎన్నికలలో కూడా పనబాక తిరుపతి పార్లమెంటుకి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసింది. అయితే 2లక్షలకుపైగా మెజారిటీతో ఇక్కడ వైసిపికి ప్రజలు జై కొట్టారు.

పనబాక లక్ష్మి చాలా తెలివైన నేత. మాజీప్రధాని పివి నరసింహారావు ఆశీస్సులతో నేదురుమల్లి నాయకత్వంలో జిల్లా రాజకీయాలలో అడుగుపెట్టింది. గెలిచినప్పుడు పొంగిపోకుండా, ఓడినప్పుడు కుంగిపోకుండా క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ కార్యకర్తగా పార్టీలో గుర్తింపును సాధించింది. 2004లో ఆమెకు టిక్కట్టు రాకుండా చెయ్యాలన్న కొందరి ప్రయత్నాలకు దివంగత నేత రాజశేఖరరెడ్డి అడ్డుకట్ట వేసి లక్ష్మికి టిక్కెట్టు ఇవ్వాల్సిందే అని పట్టుపట్టి మరి ఆమెకు టిక్కెట్టు ఇప్పించాడు. ఇక్కడినుండే ఆమె జీవితం అనూహ్య మలుపు తిరిగింది. 2004లో కేంద్ర సహాయమంత్రిగా అవకాశం పొందింది. అలా మంత్రిగా 10 సంవత్సరాలు కొనసాగింది. తొలి 5 సంవత్సారాల కాలంలో ఢిల్లీలో తన పరపతిని బాగా పెంచుకుంది. పార్టీ అధినేత్రి సోనియాగాంధీకి కుడి ఎడమగా వున్న నేతలకు లక్ష్మి బాగా దగ్గరయింది. ఫలితంగా రెండవసారి కూడా ఆమెకు మంత్రి పదవి లభించింది. వైయస్ రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడే ఒకటి రెండు సందర్భాల్లో ఆయనను బహిరంగంగానే విమర్శించింది. 2004లో ఆమెకు టిక్కెట్టు ఇప్పించి గెలిపించి మంత్రిని చేసిన వైయస్‌ను కూడా మర్చిపోయింది. నేదురుమల్లికే వ్యతిరేకంగా జిల్లాలో వర్గాన్ని కూడగట్టింది, గల్లీ నుండి ఢిల్లీ దాకా తనకు ఎదురులేదన్నట్లుగా ప్రవర్తించింది.

రాష్ట్రం విడిపోవడం, ఆంధ్రాలో కాంగ్రెస్‌పార్టీ భూస్థాపితం కావడంతో 2014 ఎన్నికలలో మళ్ళీ పార్లమెంటుకు పోటీచేసిన లక్ష్మితో పాటు గూడూరు నియోజకవర్గం నుండి శాసనసభకు పోటీ చేసిన ఆమె భర్త కృష్ణయ్య కూడా ఓడిపోయారు. 2019లో వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ వీరికి మహత్తర అవకాశాన్నిచ్చింది. భార్యా భర్తా ఇద్దరూ వస్తే ఇద్దరికీ సీట్లు ఇస్తామని అఫర్ ఇచ్చింది. అయితే అందుకు లక్ష్మి ఒప్పుకోలేదు. తనను 10 సంవత్సరాలు మంత్రిగా చేసిన కాంగ్రెస్‌పార్టీని వదిలి రానే రానని ఒట్టు పెట్టింది. తీరా ఎన్నికలు దగ్గరపడేటప్పటికి ఒట్టు తీసి గట్టున పెట్టి తెలుగుదేశం తీర్థం పుచ్చుకుని తిరుపతి పార్లమెంటుకి పోటీచేసి చిత్తుగా ఓడిపోయింది. అలాంటి పనబాక లక్ష్మిని మళ్ళీ ఇప్పుడు రాబోయే ఉప ఎన్నికలో అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించేశాడు. ఈసారి అవకాశమిస్తే ఇద్దరం పార్టీలోకి వస్తాం అన్న సందేశాన్ని పనబాక వర్గం జగన్మోహన్‌రెడ్డి చెవికి చేరేలా ప్రయత్నాలు మొదలుపెట్టిన తరుణంలో వీళ్ళు కూడా ఎక్కడ జారిపోతారోనని బాబుకి భయమేసినట్లుంది, వెంటనే ఆమెను అభ్యర్థిగా ప్రకటించేశాడు.

## కృష్ణయ్య అయితే మేలంటున్న తిరుపతి వాసులు

### కృష్ణయ్య అయితే మేలు

2019లో లక్ష్మి వెంట తిరిగిన తిరుపతి తెలుగు తమ్ముళ్లు ఎందుకనో తమకు అభ్యర్థిగా ఆమె కాకుండా ఆమె భర్త కృష్ణయ్య అయితే బాగుంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎందుకనో లక్ష్మి కంటే కృష్ణయ్య అయితేనే తమకు అన్ని విధాలా గెలిచే అభ్యర్థి అవుతాడన్నది వారి నమ్మకమని చెప్తున్నారు.

మహిళ కావడంతో పాటు 2019 ఎన్నికలలో ఓడిపోయిన సింపతీ కూడా పనబాకకు కలిసొస్తుందన్నది బాబు నమ్మకం కాబోలు. ఒకవేళ బల్లి కుటుంబ సభ్యులు బరిలో దిగినా దుబ్బాక లాంటి ఫలితం వస్తుందేమోనన్నది అయన ఆశ. చూడాలి మరి పనబాక ఎక్కిన సైకిల్ ఢిల్లీదాకా వెళ్తుందా లేక తిరుపతిలోనే పంచరవుతుందా...?





అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: lawyerpatrika@gmail.com